



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక :171 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి శుక్రవారం 3 జూలై 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :171 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI FRI 3 JULY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

- అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు స్థిరంగా కొనసాగడమే ఇందుకు కీలకం
- పాత నిల్వలు అధిక ధరకు కొన్నందున కంపెనీలకు భారీ నష్టాలు
- ఇప్పటికే పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 తగ్గించిన నయారా ఎనర్జీ
- ఇప్పటికే తగ్గిన కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధరలు



పెన్ పవర్ డెస్క్:వాహనదారులకు ఊరటనిచ్చేలా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక సంకేతాలిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రస్తుత స్థాయిలోనే స్థిరంగా కొనసాగితే, రాబోయే రెండు, మూడు నెలల్లో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

- మిగతా 2లో

## వాళ్ల డ్రామా చూస్తుంటే బిగ్ బాస్ షో చూస్తున్నట్టుంది

- గురుకుల టెండర్లపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సవాళ్ల పర్వం
- గన్ పార్క్ వద్ద బహిరంగ చర్చకు కాంగ్రెస్ మంత్రుల పిలుపు
- బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను మార్గమధ్యంలో అడ్డుకున్న పోలీసులు
- ఇదంతా బిగ్ బాస్ షో అంటూ బీజేపీ నేత బండి సంజయ్ విమర్శ

- మిగతా 2లో



## అమెరికాతో వాణిజ్య ఒప్పందం.. పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరాయన్న గోయల్
- 99 శాతం చర్చలు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి
- టారిఫ్ ప్రయోజనాలపై చట్టపరమైన అంశమే చివరి అడ్డంకి అని వెల్లడి
- చైనా, ఆగ్నేయాసియా దేశాల కన్నా భారత్‌కు ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యం

- మిగతా 2లో



### శివరాజ్ సింగ్, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా...

## ఏపీ నుంచి దేశవ్యాప్తంగా 'వీబీ జీ రామ్ జీ' పథకం ప్రారంభం

ఏపీలోని రైల్వే కోడూరు నుంచి 'వీబీ జీ రామ్ జీ' జాతీయ పథకం ప్రారంభం

- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా ఆవిష్కరణ
- చారిత్రాత్మక ఘట్టానికి వేదికగా నిలిచిన ఏపీ



కార్యక్రమంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.

ఆంధ్రప్రదేశ్ మరో చారిత్రక ఘట్టానికి వేదికైంది. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్' (వీబీ జీ రామ్ జీ) ఏపీ నుంచే ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ బృహత్తర పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.



లబ్ధిదారులకు జాబ్ కార్డుల పంపిణీ



గీతం ఆవిష్కరణ, పోర్టల్ ప్రారంభం



రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ముక్కవారిపల్లి గ్రామంలో రూ.4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనులకు నేతలు శ్రీకారం చుట్టారు. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను వీబీ జీ రామ్ జీ మిషన్ కింద తొలి పనులుగా ప్రారంభించారు. అనంతరం స్థానిక లబ్ధిదారులకు కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం కలిసి జాబ్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ కలిసి పథకం ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పథకానికి సంబంధించిన సమాచార బుక్‌లెట్‌ను, ఇతర ప్రచురణలను విడుదల చేయగా, నేతలంతా కలిసి పథకం అధికారిక పోర్టల్‌ను ప్రారంభించారు.

## నేను చదివిన ఆర్థికశాస్త్రం కంటే సమాజమే ఎక్కువ నేర్పింది: సీఎం చంద్రబాబు

- ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్‌పై తిరుపతిలో వర్క్ షాప్
- ప్రజల జీవితాల్లో మార్పే అభివృద్ధికి అసలైన కొలమానం అని చంద్రబాబు స్పష్టీకరణ
- అమరావతిలో త్వరలో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేస్తామని ప్రకటన
- ఏపీ ప్రభుత్వ విధానాలను ప్రశంసించిన కేంద్ర ఆర్థిక సలహాదారులు

- మిగతా 2లో



## నాకు చాలా టఫ్ బాస్ ఉన్నారు

### శ్రీసిటీ వర్సిటీ ప్రారంభోత్సవంలో నారా లోకేశ్

- శ్రీసిటీలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి లోకేశ్
- 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని ఉద్ఘాటన
- వర్సిటీ ద్వారా 75 వేల ఉద్యోగాలను సృష్టిస్తామని వెల్లడి
- పెట్టుబడిదారులకు 3పూ మోడల్‌తో పూర్తి భరోసా ఇస్తున్నామని వివరణ
- ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త సీఎం టార్గెట్ అని స్పష్టం


పెన్ పవర్ డెస్క్:తమ ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా కఠినమైన బాస్ (టఫ్ బాస్) అని, ఆయన కన్న కలలను సాకారం చేసేందుకు తమను నిరంతరం పరుగులు పెట్టిస్తున్నారని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలన్న బలమైన ఆకాంక్షతో ఆయన పనిచేస్తున్నారని, అందుకు అనుగుణంగా తామంతా అదే వేగంతో పనిచేయాల్సి వస్తోందని అన్నారు.

- మిగతా 2లో

## వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం... ఉత్తరాంధ్రకు వర్షసూచన

- రానున్న 2-3 రోజుల్లో అల్పపీడనం మరింత బలపడే అవకాశం
- ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా
- తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు
- పలు జిల్లాలకు వర్ష సూచన జారీ

- మిగతా 2లో



## క్రాంతి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన జగన్
- పోలీసు వేధింపుల వల్లే క్రాంతి మృతి చెందాడని ఆరోపణ
- సీఎం రక్షణ వల్లే దోషులు తప్పించుకుంటున్నారని జగన్ విమర్శ
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని హామీ

పెన్ పవర్ డెస్క్:విజయవాడలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని వైసీపీ అధినేత జగన్ గురువారం పరామర్శించారు. క్రాంతి కుమార్ భార్య, పిల్లలు, తండ్రిని ఓదార్చిన జగన్, వారికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని భరోసా ఇచ్చారు.అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్.. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనడానికి

- మిగతా 2లో



## ఏపీకి నేను మేనమామను... మేనమామ ఎప్పుడూ ఉత్త చేతులతో రాడు

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

- చంద్రబాబు, పవన్‌తో కలిసి వీబీ జీ రామ్ జీ పథకాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి
- రాష్ట్రానికి 74,212 పక్కా ఇళ్లు, రోడ్లకు రూ.422 కోట్లు ప్రకటించిన చౌహాన్
- వీబీ జీ రామ్ జీ కింద ఏపీకి 9 నెలల్లో రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని హామీ
- మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద తోతాపురి మామిడి కొనుగోలుకు అంగీకారం

- మిగతా 2లో



## రాజకీయాల్లోకి స్టార్ హీరో సూర్య.. నిజమెంత?



- స్టార్ హీరో సూర్య రాజకీయ ప్రవేశంపై జోరుగా ప్రచారం
- అభిమాన సంఘం ప్రతినిధి వ్యాఖ్యలతో మొదలైన ఊహాగానాలు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన వార్తలను ఖండించిన సూర్య టీమ్
- ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని స్పష్టీకరణ
- సేవా కార్యక్రమాలకు, రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడి

2లో

## అమరావతిపై జగన్ మరో డ్రామా.. రాష్ట్ర భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు



పెన్ పవర్ డెస్క్:అమరావతిపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా గందరగోళంగా ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఒకప్పుడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్, తర్వాత

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## బీజేపీలో నెక్స్ జన్ లీడర్ షిప్...

భారతీయ జనతా పార్టీ లో ఊహించని రీతిలో సమూల ప్రక్షాళనకు తెరలేచింది. కేవలం కేంద్ర మంత్రివర్గంలోనే కాదు.. అటు పార్టీ సంస్థాగత నిర్మాణంలోనూ పెను మార్పులు తీసుకురావాలని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ద్వయం గట్టి పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ, అమిత్ షాల తర్వాత ఢిల్లీ బీజేపీలో అత్యంత శక్తివంతమైన చక్రం తిప్పుతున్న జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ను ప్రస్తుత బాధ్యతల నుంచి పక్కన పెట్టే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సుదీర్ఘ కాలంగా పార్టీ అంతర్గత వ్యవహారాలను, టికెట్ల కేటాయింపులను, ఎన్నికల వ్యూహాలను శాసిస్తున్న ఆయనను తిరిగి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాతృ సంస్థకు పంపేందుకు తెరవెనుక ముమ్మర కసరత్తు జరుగుతోందని ఢిల్లీ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. బీఎల్ సంతోష్ ను మార్చడం కేవలం ఒక వ్యక్తిని మార్చడం కాదు, ఇది రాబోయే 15-20 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బీజేపీ వేస్తున్న ఒక చారిత్రాత్మక అడుగు. ప్రస్తుతం 70 ఏళ్ల వయస్సుకు చేరువవుతున్న సీనియర్ నేతల స్థానంలో, సాంకేతికతపై పట్టు ఉండి, మారుతున్న యువ భారతదేశ ఓటర్ల నాడిని పట్టుకోగల నెక్స్ట్ జనరేషన్ లీడర్లను కీలక స్థానాల్లో కూర్చోబెట్టాలని మోదీ-షా భావిస్తున్నారు. పార్టీని తదుపరి తరానికి సజావుగా పాస్ చేసే ప్రక్రియలో భాగంగానే ఈ సంస్థాగత శస్త్రచికిత్సకు శ్రీకారం చుట్టారని ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్ కోటా నుండి వచ్చి బీజేపీ జాతీయ సంఘటనా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బీఎల్ సంతోష్.. పార్టీలో అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. అయితే, గత కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో యడియూరప్ప లాంటి మాస్ లీడర్లను కాదని ఆయన అనుసరించిన కొన్ని క్షేత్రస్థాయి వ్యూహాలు పార్టీని ఘోరంగా దెబ్బతీశాయనే అసంతృప్తి అధిష్ఠానంలో బలంగా నాటుకుపోయింది. సౌత్ ఇండియాలో బిగ్గెస్ట్ గేట్‌వే అయిన కర్ణాటకను చేజార్చుకోవడం, అలాగే కొన్ని ఉత్తరాది రాష్ట్రాలలో టికెట్ల పంపిణీలో లోపాలు ఉండటం వల్లే పార్టీ ఆశించిన మెజారిటీని సొంతంగా సాధించలేకపోయిందనే ఇంటెలిజెన్స్ నివేదికలు మోదీ-షాలకు చేరినట్లు తెలుస్తోంది. దీంతో ఆర్గనైజేషనల్ స్ట్రక్చర్‌లో సరికొత్త రక్తాన్ని ఎక్కించక తప్పదని ఢిల్లీ పెద్దలు డిసైడ్ అయ్యారు. బీజేపీ లేదా సంఘ్ పరివార్ వ్యూహాల్లో జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి పదవి అత్యంత శక్తివంతమైనది. ఈ స్థానంలో ఉన్న వ్యక్తి నేరుగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి, బీజేపీ అధినాయకత్వానికి మధ్య ఒక బలమైన వంతెనలా పనిచేస్తారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి కంటే కూడా అంతర్గత నియామకాలు, క్రమశిక్షణ చర్యలు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌ల నివేదికలపై ఈ పదవిలో ఉన్న వ్యక్తికే ఎక్కువ పట్టు ఉంటుంది. గతంలో కుశభావ్ ఠాక్రే, ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా, ఆ తర్వాత సంజయ్ జోషి, రామ్ లాల్ వంటి దిగ్గజాలు పనిచేసిన ఈ స్థానంలో మార్పు జరుగుతోందంటే.. పార్టీ సిద్ధాంత పరంగా, శైలి పరంగా చాలా పెద్ద మలుపు తిరగబోతోందని అర్థం. ఇటీవలి కాలంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ తదితర ప్రముఖులు చేసిన కొన్ని వ్యాఖ్యలు, బీజేపీ అంతర్గత అంశాలపై విమర్శలు చేశారు. క్షేత్రస్థాయిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు , బీజేపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. బీఎల్ సంతోష్ హయాంలో సంఘ్‌కు, పార్టీకి మధ్య ఒక విధమైన కోల్డ్ వార్ నడిచిందనే ప్రచారం కూడా ఉంది. ఇప్పుడు సంతోష్‌ను తిరిగి ఆర్ఎస్ఎస్‌కు పంపి, ఇరు వర్గాలకు ఆమోదయోగ్యుడైన సరికొత్త, సౌమ్యుడైన వ్యూహకర్తను ఆ స్థానంలో పెట్టడం ద్వారా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను మళ్లీ ఎన్నికల పోరాటాల్లో యాక్టివ్ చేయాలని మోదీ భావిస్తున్నారు. మొత్తానికి మోదీ 3.0 ప్రభుత్వ హయాంలో అటు కేబినెట్, ఇటు పార్టీ ఐడెంటిటీని పూర్తిగా మార్చేసే లాంగ్ టర్మ్ ప్లాన్ అమలవుతోంది కీలకమైన ప్రధాన కార్యదర్శుల మార్పుల ద్వారా సరికొత్త టీమ్ మోదీ రూపుదిద్దుకోనుంది. పాత సంకెళ్లను తెంచుకుని, కేవలం పనితీరు, గెలుపు గుర్రాలకే ప్రాధాన్యత ఇస్తూ బీజేపీ చేయబోతున్న ఈ మహా ప్రక్షాళన.. మిగిలిన రాజకీయ పార్టీలకు కూడా ఒక పెద్ద సంకేతాన్ని పంపుతోంది.

## క్రాంతి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం

- మొదటి పేజి తరువాయి

క్రాంతి కుమార్ ఆత్మహత్యే నిదర్శనమని అన్నారు. "ఆత్మహత్య చేసుకునే ముందు క్రాంతి కుమార్ స్వయంగా సెల్ఫీ వీడియో తీసి, సీఐ నాగరాజు, ఇతర పోలీసుల వేధింపుల గురించి వివరించారు. అయినా ఇంతవరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు" అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎనిమిదేళ్ల క్రితం నమోదైన చిన్న కేసుల కోసం గత మూడు నెలలుగా రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించడం వల్లే అతను ప్రాణాలు తీసుకున్నాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి నివాసానికి, డీజీపీ, హోంమంత్రి కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగిందని జగన్ అన్నారు. "సీఐని కమిషనర్, కమిషనర్‌ను డీజీపీ, డీజీపీని ముఖ్యమంత్రి కాపాడుతున్నారు. ఇది ఒక ప్రొటెక్షన్ రాకెట్‌లా నడుస్తోంది" అని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేయకపోవడం దారుణమన్నారు. క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయపరమైన సహాయంతో సహా అన్ని విధాలా అండగా ఉంటామని జగన్ స్పష్టం చేశారు.

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

- మొదటి పేజి తరువాయి

ఉందని ఆయన గురువారం వెల్లడించారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడిచమురు ధరలు గరిష్ఠంగా ఉన్న సమయంలో కొనుగోలు చేసిన నిల్వలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రస్తుతం వినియోగిస్తున్నాయని మంత్రి వివరించారు. దీనివల్ల జూన్ 30 నాటికి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాలపై సుమారు రూ. 74,781 కోట్ల మేర నష్టాలను చవిచూశాయని పేర్కొన్నారు. ధరల తగ్గింపుపై ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుందని, అదంతా ముడిచమురు ధరల స్థిరత్వంపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదిలావుండగా, ప్రైవేట్ రంగ ఇంధన రిటైలర్ 'నయారా ఎనర్జీ' జూలై 1 నుంచి తన అవుట్‌లెట్లలో లీటరు పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 3 చొప్పున తగ్గించింది. గత రెండేళ్ల కాలంలో చమురు ధరలు తగ్గడం ఇదే తొలిసారి. అలాగే, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరలను సైతం రూ. 183.50 మేర తగ్గించగా, గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు.

గత నాలుగేళ్లలో భారత్‌లో పెట్రోల్ ధరలు కేవలం 5.58 శాతం, డీజిల్ ధరలు 6.23 శాతం మేర మాత్రమే పెరిగాయని, అదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాల్లో 20 శాతం, పొరుగు దేశాల్లో 35 శాతం వరకు పెరిగాయని మంత్రి గుర్తు చేశారు. అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం తగ్గించి ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12, డీజిల్ ధర రూ. 95.20 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

## అమరావతిపై జగన్ మరో డ్రామా.. రాష్ట్ర భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు

- మొదటి పేజి తరువాయి

మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు 'మావిగన్' పేరుతో మరో కొత్త నినాదం తీసుకురావడం ప్రజలను అయోమయంలోకి నెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే అసలు పోటీ జరుగుతోందన్నారు. అమరావతిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు జాతీయ బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ కంపెనీలు అక్కడ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఏఐ యూనివర్సిటీ, ఎన్ఐడీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు అమరావతికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రాజధానిపై అనిశ్చితి సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. అమరావతి కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చి త్యాగాలు చేశారని సోమిరెడ్డి అన్నారు. ప్రస్తుతం రూ.57,821 కోట్ల విలువైన 97 అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అమరావతి కేవలం నగరం కాదని, ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్ష అని చెప్పారు. ప్రజల ఆస్తులు, రైతుల భవిష్యత్తును దెబ్బతీసేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని జగన్‌ను హెచ్చరించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని సోమిరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి లోకేశ్ పెట్టుబడులు తీసుకురావడానికి ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తున్నారని చెప్పారు. గతంలో మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రజలు తిరస్కరించారని, ఇప్పుడు కొత్త నినాదాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఫలించవని వ్యాఖ్యానించారు. రాష్ట్ర భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# నేను చదివిన ఆర్థికశాస్త్రం కంటే సమాజమే ఎక్కువ నేర్పింది

తాను ఆర్థిక శాస్త్రం చదివినప్పటికీ, పుస్తకాల కంటే సమాజం, ప్రజల నుంచే ఎక్కువ నేర్చుకున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్థిక వృద్ధి గణాంకాలు పెరగడం మాత్రమే కాకుండా, ఆ వృద్ధి పేదల జీవితాల్లో ఎంత మార్పు తీసుకొస్తోందన్నదే ప్రభుత్వానికి అసలైన కొలమానమని స్పష్టం చేశారు. డేటా ఆధారిత పాలన, సమర్థవంతమైన పరిపాలన ద్వారానే రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దగలమని ఆయన పేర్కొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న 'ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్' రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

### పేదల జీవితాల్లో మార్పు కోసమే పాలన

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జీఎస్‌డీపీ, సీఏజీఆర్ వంటి ఆర్థిక సూచికలను విశ్లేషిస్తూనే, వాటి ఫలాలు ప్రజల జీవన ప్రమాణాలను ఎలా మెరుగుపరుస్తున్నాయో చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇటీవలే గూడూరులో తాను పెన్షన్ పంపిణీ చేసిన తులశమ్మ, పద్మమ్మ కుటుంబాల స్థితిగతులను ఉదాహరణగా చూపుతూ, ప్రభుత్వ పథకాలు వారి జీవితాల్లో తెచ్చిన మార్పును సవివరంగా తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డ్వాక్రా రుణాల ద్వారా ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎలా నిలదొక్కుకుంటున్నాయో వివరించారు.

### దార్శనికతతో ముందుకు..

దేశంలోనే తొలిసారిగా విజన్-2020 రూపొందించినప్పుడు ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని, కానీ భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి పనిచేశామని గుర్తు చేశారు. ఐటీ విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చి, సేవల రంగంలో అపార అవకాశాలు సృష్టిస్తుందని అప్పుడే విశ్వసించి, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కూడా దేశానికి ఒక విజన్ డాక్యుమెంట్ అవసరమని బలంగా నమ్మారని చెప్పారు. ప్రస్తుత యుగంలో డేటానే అసలైన సంపద అని, భవిష్యత్ మొత్తం డేటా ఆధారిత నిర్ణయాలపైనే నడుస్తుందని ఆయన పేర్కొన్నారు.

### టెక్నాలజీతో పారదర్శక పాలన

ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందించడంతో పాటు, రాష్ట్రంలో సంపద సృష్టించేందుకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కూడా అంతే కీలకమని చంద్రబాబు అన్నారు. అందుకే స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వ శాఖలన్నింటి సమాచారాన్ని ఒకే వేదికపైకి తెచ్చేందుకు 'డేటా లేక్' రూపొందిస్తున్నామని, ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు హెల్త్ రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేసే 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేస్తున్నామని తెలిపారు. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు, సమాజం ద్వారా ఎదిగిన వారు తిరిగి సమాజానికి సేవ చేసేలా ప్రోత్సహించేందుకు 'పీ4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు.

### అమరావతిలో క్వాంటం కంప్యూటర్

అనంతరం సభికులతో జరిగిన ముఖాముఖిలో సీఎం మాట్లాడుతూ.. తాను త్వరగా సంతృప్తి చెందే వ్యక్తిని కాదని, సంతృప్తి చెందితే అక్కడితో ఆగిపోతామని అన్నారు. ప్రజల కోసం నిరంతరం కొత్త విధానాలు, సాంకేతికతను అన్వేషిస్తూనే ఉండాలని సూచించారు. "దేశం నాకేమిచ్చిందని కాకుండా, దేశానికి మనమేం చేశామని ఆలోచించాలి" అని యువతకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఒక కీలక ప్రకటన చేస్తూ, త్వరలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లను తయారు చేసే సామర్థ్యాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### ఏపీ విధానాలపై నిపుణుల ప్రశంసలు

ఈ వర్క్‌షాప్‌లో భాగంగా జరిగిన ప్యానెల్ చర్చను ముఖ్యమంత్రి సభికుల మధ్య కూర్చొని ఆసక్తిగా తిలకించారు. ఈ చర్చలో పాల్గొన్న కేంద్ర స్టాటస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ శాఖ కార్యదర్శి డాక్టర్ సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఆర్. బాలసుబ్రహ్మణ్యం, ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ తదితరులు ఏపీ ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు. నియోజకవర్గాల వారీ విజన్ ప్లాన్, పీ4 కార్యక్రమం, గ్రామస్థాయిలో డేటా సేకరణ వంటివి దేశంలోనే వినూత్నమైనవని, వీటిని జాతీయ స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం...
# ఉత్తరాంధ్రకు వర్షసూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రలోని ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని హెచ్చరించింది. వాయవ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఒడిశా-బెంగాల్ తీర ప్రాంతాల్లో ఈ అల్పపీడనం కేంద్రీకృతమై ఉంది. ఇది రానున్న రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని పేర్కొన్నారు. (జూలై 3) శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అల్పపీడన కదలికలను నిరంతరం గమనిస్తున్నామని, ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని తెలిపారు.

# ఏపీకి నేను మేనమామను... మేనమామ ఎప్పుడూ ఉత్త చేతులతో రాడు

ఆంధ్రప్రదేశ్‌కు తాను మేనమామ లాంటి వాడినని, మేనమామ ఎప్పుడూ ఖాళీ చేతులతో రాడని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. తనను మధ్యప్రదేశ్‌లో ప్రజలంతా ఆప్యాయంగా 'మామాజీ' అని పిలుస్తారని, ఇప్పుడు ఏపీ ప్రజలకు కూడా తాను మేనమామనే అయ్యానని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వరాల జల్లు కురిపిస్తూ, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అందజేశారు.

తిరుపతి జిల్లా రైల్వేకోడూరులో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' (వీబీ జీ రామ్ జీ)ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి శివరాజ్ సింగ్ చౌహాన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ఏపీ నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావడం చారిత్రక ఘట్టమని ఆయన అభివర్ణించారు. దేశవ్యాప్తంగా గ్రామాల అభివృద్ధి కోసం ఈ పథకం కింద రూ.7.5 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రాబోయే 9 నెలల కాలానికి గాను ఈ పథకం కింద ఏపీకి రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ సభలే తమకు అవసరమైన పనులను ఎంపిక చేసుకుని అమలు చేసే అధికారం ఈ పథకం కల్పిస్తుందని వివరించారు.

ఈ సందర్భంగా రైతుల కోసం మరో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలోని రైతుల నుంచి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద 2,16,250 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని కేంద్రం కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కూడా ఆయన ముఖ్యమంత్రికి అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని, ఎట్టిపరిస్థితుల్లోనూ చేయి విడిచిపెట్టే ప్రసక్తే లేదని చౌహాన్ స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ

పుట్టినరోజున ఒక మొక్క నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేశ్ పాశ్వాన్, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వాళ్ల డ్రామా చూస్తుంటే బిగ్ బాస్ షో చూస్తున్నట్టుంది

తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. గురుకుల టెండర్లలో అవకతవకలు, రాష్ట్ర అప్పుల అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య చోటుచేసుకున్న సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ విసిరిన సవాల్‌ను స్వీకరించి గన్ పార్క్ వైపు బయలుదేరిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో హైడ్రామా నెలకొంది. ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న వ్యవహారం 'బిగ్ బాస్' షోను తలపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. పైకి పోరాటంలా కనిపిస్తున్నా, లోపల ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయని సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. ఈ రెండు పార్టీల అవినీతి, రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలపై బహిరంగ చర్చ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు సూచించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తెలంగాణకు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ప్రజలకు వివరిద్దామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు 'డబుల్ ఎలిమినేషన్' తప్పదని, రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్' సర్కార్ రావడం ఖాయమని బండి సంజయ్ జోస్యం చెప్పారు.

# అమెరికాతో వాణిజ్య ఒప్పందం.. పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ దాదాపు 99 శాతం పూర్తయిందని, కేవలం ఒకే ఒక్క కీలక అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా అమెరికా మార్కెట్‌లో ప్రాంతీయ పోటీదారుల కంటే భారత్‌కు విశేష ప్రాధాన్యత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'ఇండో-జపాన్ స్ట్రాటజిక్ డైలాగ్' కార్యక్రమంలో పీయూష్ గోయల్ ప్రసంగించారు. ఈ ఒప్పందం ఇరు దేశాలకూ అత్యంత న్యాయబద్ధంగా, సమతుల్యంగా ఉంటుందని ఆయన అభివర్ణించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, భారత్‌కు సుంకాల పరంగా లబ్ధి చేకూర్చేందుకు అవసరమైన చట్టబద్ధమైన యంత్రాంగాన్ని రూపొందించడమే ప్రస్తుతం మిగిలి ఉన్న ఆ ఒక శాతం అడ్డంకి అని ఆయన వివరించారు. తయారీ రంగంలో ప్రధాన పోటీదారులైన చైనా, ఆగ్నేయాసియా దేశాల కంటే భారత్‌కు మెరుగైన ప్రాధాన్యత లభించాలని కోరుతున్నామని, దీనిపై అమెరికా సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం చురుగ్గా కృషి చేస్తోందని తెలిపారు. 2025 ప్రారంభంలో ఈ సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాను ఇరు దేశాలు ప్రకటించాయి. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ సైతం ఈ ఒప్పందం తుది దశకు చేరుకుందని, కేవలం ఒక శాతం మాత్రమే పెండింగ్‌లో ఉందని ఇటీవల వ్యాఖ్యానించారు. జూలై 24న అమెరికా తాత్కాలిక టారిఫ్ చర్యల గడువు ముగియనున్న నేపథ్యంలో, ఆలోపే తొలి విడత ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## రాజకీయాల్లోకి స్టార్ హీరో సూర్య.. నిజమెంత?

తమిళనాడు రాజకీయాల్లో సినీ గ్లామర్ మరోసారి చర్చనీయాంశమైంది. నటుడు విజయ్ దళపతి పొలిటికల్ ఎంట్రీతో విజయవంతం కావడంతో ఇతర స్టార్ హీరోల రాజకీయ ప్రవేశంపై తరచూ ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో స్టార్ హీరో సూర్య త్వరలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారంటూ వచ్చిన వార్తలు కోలీవుడ్ వర్గాల్లో కలకలం రేపాయి. సోషల్ మీడియాలో ఈ ప్రచారం జోరుగా సాగడంతో దీనిపై సూర్య టీమ్ అధికారికంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చింది.

### అభిమాన సంఘం నేత వ్యాఖ్యలతోనే..

సూర్య ఎన్నో ఏళ్లుగా 'అగరం ఫౌండేషన్' ద్వారా విద్యార్థులకు, పేదలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన అభిమాన సంఘాలు కూడా ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాయి. ఇటీవల చెన్నైలో జరిగిన 'సూర్య అఖిల భారత అభిమానుల పరిరక్షణ సంఘం' సమావేశంలో సంఘ ప్రతినిధి ఆర్. వీరమణి మాట్లాడుతూ భవిష్యత్తులో సూర్య రాజకీయాల్లోకి రావడం ఖాయమనే అర్థం వచ్చేలా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ఆధారం చేసుకుని కొన్ని తమిళ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించడంతో సూర్య రాజకీయ అరంగేట్రం వార్త వేగంగా వైరల్ అయింది. విజయ్ తరహాలోనే సూర్య కూడా ప్రజాసేవ నుంచి రాజకీయాల్లోకి వస్తున్నారని అభిమానులు అంచనా వేశారు.

### పుకార్లకు తెరదించిన సూర్య టీమ్

ఈ ప్రచారం ఊపందుకోవడంతో సూర్య టీమ్ వెంటనే రంగంలోకి దిగింది. సూర్యకు రాజకీయాల్లోకి రావాలనే ఆలోచన ప్రస్తుతానికి ఎంతమాత్రం లేదని స్పష్టం చేసింది. అభిమాన సంఘం సమావేశంలో వీరమణి చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, వాటితో సూర్యకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. సూర్య నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని, సమాజానికి మేలు చేయాలనే స్వచ్ఛమైన ఆశయంతోనే 'అగరం ఫౌండేషన్' ద్వారా విద్యార్థుల ఉన్నత చదువులకు సహాయం చేస్తున్నారని వివరించింది. కేవలం సామాజిక బాధ్యతతోనే ఆయన ఈ కార్యక్రమాలు చేపడుతున్నారని, వాటికి రాజకీయ రంగు పులమడం సరికాదని హితవు పలికింది. ఈ ప్రకటనతో సూర్య రాజకీయ ప్రవేశంపై జరుగుతున్న ప్రచారానికి ప్రస్తుతానికి తెరపడినట్లయింది.

## నాకు చాలా టఫ్ బాస్ ఉన్నారు

- మొదటి పేజి తరువాయి

గురువారం తిరుపతి జిల్లా శ్రీసిటీలో శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీని (ఎస్ఐయూ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన ప్రభుత్వ దార్శనికతను, లక్ష్యాలను వివరించారు.

### 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఉన్నత శిఖరాలకు చేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. "దేశ ఆర్థికాభివృద్ధిలో మన రాష్ట్రం ముందుండాలి. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ 220 బిలియన్ డాలర్లుగా ఉంది. దీనిని 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని కృతనిశ్చయంతో ఉన్నాం" అని ఆయన ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వస్తున్న నూతన విద్యా విధానం, స్టార్టప్ ఇండియా, వికసిత్ భారత్ వంటి కార్యక్రమాలు దేశ విద్యా వ్యవస్థలో గొప్ప మార్పులు తీసుకొస్తున్నాయని కొనియాడారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా రాష్ట్రాలను ప్రోత్సహిస్తున్నారని, ఒక రాష్ట్రం మంచి పని చేస్తే మిగతా రాష్ట్రాలు పోటీపడతాయని ఆయన నమ్ముతారని లోకేశ్ తెలిపారు.

### ఏపీ యువతకు వరం శ్రీసిటీ యూనివర్సిటీ

శ్రీసిటీలో ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిన వ్యవస్థాపకులు శ్రీని రాజు, రవీంద్ర సన్నారెడ్డిలను లోకేష్ అభినందించారు. ఇది కేవలం ఒక యూనివర్సిటీ ప్రారంభోత్సవం కాదని, ఉన్నత విద్యపై సరికొత్త ఆలోచనా విధానానికి పునాది అని అభివర్ణించారు.

"ఒక ఐడియాను వాస్తవరూపంలోకి తెచ్చిన శ్రీని రాజు గారికి నా అభినందనలు. ఇది ఆంధ్రప్రదేశ్ యువతకు ఒక పెద్ద గిఫ్ట్. ప్రస్తుతం 5,000 మంది విద్యార్థులతో ప్రారంభమవుతున్నా, భవిష్యత్తులో ఈ సంఖ్య కొన్ని రెట్లు పెరుగుతుందన్న నమ్మకం నాకుంది" అని ఆయన అన్నారు. కేవలం డిగ్రీలు ఇవ్వడమే కాకుండా, సమాజంలో ఎలాంటి మార్పు తీసుకొస్తున్నామనే దానిపైనే యూనివర్సిటీల విలువ ఆధారపడి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### విద్యారంగంలో వినూత్న సంస్కరణలు

భారతదేశంలో ఉన్నత విద్యలో సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని లోకేశ్ నొక్కి చెప్పారు. శ్రీసిటీ యూనివర్సిటీలో ప్రవేశపెట్టిన 'వర్క్-స్టడీ' మోడల్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. దీనిని తాను 'లెగ్' మోడల్ అని పిలుస్తానని, అంటే నేర్చుకుంటూ, సంపాదిస్తూ, పట్టభద్రులు కావడమని వివరించారు.

"డిగ్రీ రాగానే చదువు ఆగిపోకూడదు. జీవితాంతం నేర్చుకోవడం అక్కడే మొదలవుతుంది. ఈ లెగ్ మోడల్ మన విద్యా వ్యవస్థ రూపురేఖలనే మార్చేస్తుంది" అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యార్థులను కేవలం పట్టభద్రులుగా కాకుండా, సమస్యలను పరిష్కరించేవారిగా, నిరంతర అభ్యాసకులుగా తీర్చిదిద్దాలని సూచించారు.

# టిడిపి సీనియర్ నాయకుడు లక్ష్మీ నరసప్ప (బుడ్డన్న) కన్నుమూత



మడకశిర, (పెన్ పవర్) జూలై 2: మడకశిర పట్టణంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మీ నరసప్ప (బుడ్డన్న) గురువారం మధ్యాహ్నం అకాల మృతి చెందారు. ఆయన రాజకీయ జీవితంలో రెండు సార్లు ఎంపీపీగా, ఒకసారి జడ్పిటిసి సభ్యుడిగా, మరోసారి బ్యాంకు చైర్మన్‌గా ప్రజాసేవలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. స్థానిక రాజకీయాల్లో ఆయనకు ఉన్న అనుభవం, ప్రజలతో ఉన్న అనుబంధం వల్ల మడకశిరలో ఆయనకు ప్రత్యేక స్థానం ఏర్పడింది. వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే రాజు హుటాహుటిన మాజీ మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు ఇంటికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎల్లప్పుడూ తోడుంటామని భరోసా ఇచ్చారు. లక్ష్మీ నరసప్ప ప్రజాసేవలో చూపిన కృషి, పార్టీకి అందించిన సేవలు, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన ప్రయత్నాలు మడకశిర ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలుస్తాయని స్థానిక నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి, ప్రాంతానికి తీరని లోటు అని వారు అభిప్రాయపడ్డారు.

# గ్రామీణ పేదల జీవనోపాధికి వీబీ-జీ రామ్‌జీ పథకం వరం

### డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రూ.14 లక్షల కోట్ల నిధులు
### గ్రామీణ పేదలకు ఏడాదికి 125 రోజుల ఉపాధి
### నియోజకవర్గంలో దాదాపు 18,929 కుటుంబాలకు ఏటా రూ.17.51 కోట్ల ప్రయోజనం
### కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి







కోవూరు పెన్ పవర్ జూలై 2. గ్రామీణ పేద కుటుంబాలకు స్థిరమైన ఉపాధి, ఆదాయ భద్రత కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్--గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్--గ్రామీణ్ (వీబీ-జీ రామ్‌జీ)' పథకం రూపొందించిందని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం రామన్నపాళెం పంచాయతీలో వీబీ జీ రామ్ జీ ప్రారంభోత్సవంలో ఆమె మాట్లాడారు. ఎన్నో ఆర్థిక సమస్యలతో ఉన్న రాష్ట్రాన్ని ప్రజలు కూటమి ప్రభుత్వానికి అప్పగించారని, అయినప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండేళ్లలోనే ఎన్నికల హామీలలో అత్యధిక భాగాన్ని అమలు చేశారని పేర్కొన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోవాల్సిన మనకు కొత్త దిశను చూపిన నాయకుడు చంద్రబాబు కొనియాడారు. ఇందుకు ప్రధాని మోదీ గొప్ప సహకారం అందించారని తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రభుత్వం ఉండటం వల్ల గత రెండేళ్లలో కేంద్రం నుంచి రూ.14 లక్షల కోట్ల విలువైన నిధులు రాష్ట్రానికి లభించాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ప్రశాంతి రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం వీబీ-జీ రామ్‌జీ పథకం అధికారిక జాతీయ ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసిందని పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లి గ్రామంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, గ్రామీణ కుటుంబాలకు జీవనోపాధి భద్రత కల్పించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వివరించారు. వ్యవసాయ పనులకు ఆటంకం కలగకుండా పంట నాట్లు, కోత సమయంలో 60 రోజుల పని విరామం కల్పించడంతో పాటు, గ్రామీణ పేదలకు ఏడాదికి 125 రోజుల ఉపాధి కల్పించేలా ఈ పథకాన్ని రూపొందించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కార్మికులకు రోజువారీ కూలీని రూ.312గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, గతంతో పోలిస్తే రూ.5 పెంపు చేసినట్లు తెలిపారు. కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఈ-కేవైసీ ఎంజీఎన్ఆర్ఈజీఏ జాబ్ కార్డులే చెల్లుబాటవుతాయని స్పష్టం చేశారు. జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీలో నమోదు చేసుకుంటే సరిపోతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కోవూరుకు 17.51 కోట్ల ప్రయోజనం పనులు పూర్తయిన 15 రోజుల్లోపు వేతనాలు చెల్లిస్తారని తెలిపారు. ఈ పథకం వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ పథకం అమలుకు ఏటా రూ.1,51,282 కోట్లు వ్యయం చేయనున్నారని, గత ఏడాదితో పోలిస్తే ఈసారి కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ.17 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా ఏడాదికి 18,929 కుటుంబాలకు సుమారు రూ.17.51 కోట్ల మేర ప్రయోజనం అందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 3,156 కుటుంబాలకు రూ.2.78 కోట్లు, కోవూరు మండలంలో 3,074 కుటుంబాలకు రూ.2.72 కోట్లు, ఇందుకూరుపేట మండలంలో 4,426 కుటుంబాలకు రూ.4.77 కోట్లు, కొడవలూరు మండలంలో 3,590 కుటుంబాలకు రూ.3.87 కోట్లు, విడవలూరు మండలంలో 4,683 కుటుంబాలకు రూ.3.36 కోట్ల మేర ఉపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ కార్మికులు ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు.

# జనసేన 'నిర్మాణ సారథుల' ప్రక్రియ విజయవంతం కావాలి

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకాంక్ష





నెల్లూరు పెన్ పవర్ జూలై 2. మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ గురువారం సాయంత్రం కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ నెల్లూరు పార్లమెంట్ అబ్జర్వర్‌గా నియమితులైన నర్సాపురం జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ బొమ్మిడి నాయకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. జూన్ 29 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలు పని చేస్తున్నాయి. ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ గారు నెల్లూరులో పర్యటిస్తున్నారు. పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకుజనసేనపార్టీ బాధ్యతలతోపాటు, వివిధ అనుబంధ విభాగాల్లో సేవలందించాలనే ఆసక్తి ఉన్న జనసేన సాధకులు, నాయకులు, జనసైనికులందరికీ ఈ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే అవకాశం కల్పిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పారదర్శకంగా నిర్వహిస్తున్న జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ప్రక్రియ విజయవంతం కావాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।

# ఏ ఐ ఐ ఇ ఏ ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్ లు,పండ్లు పంపిణీ



నాయుడుపేట, పెన్ పవర్, జూలై 02 ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏ ఐ ఐ ఇ ఏ )76వ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గురువారం నాయుడుపేట ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, గర్భిణీ స్త్రీలకు బ్రెడ్‌లు,పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 1ఐ చి ఇ యు నాయుడుపేట బ్రాంచి కార్యదర్శి ఎం. సునీల్ మాట్లాడుతూ జూలై 3న నాయుడుపేట ఎల్ ఐ సి కార్యాలయ ఆవరణలో భారీ స్థాయిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరంతో పాటు ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో రక్తదాన శిబిరంలో పాల్గొని ప్రాణదాతలుగా నిలవాలని, ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచి మేనేజర్ ప్రసన్న కుమార్, ఐ సి ఈ యు బ్రాంచి అధ్యక్షుడు సురేంద్ర బాబు, సభ్యులు రాజేశ్వరి,ఎల్ ఐ ఏ ఎఫ్ ఐ నాయకులు ఏవీవీ కుమార్, బాలగురునాథం,ప్రశాంత్,మధు రెడ్డి,సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రేపే నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక 'గ్రీవెన్స్ డే'

## స్వయంగా అర్జీలు స్వీకరించనున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



నాయుడుపేట, పెన్ పవర్, జూలై 02 తిరుపతి జిల్లా నాయుడుపేట పురపాలక కార్యాలయంలో జూలై 3వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక 'గ్రీవెన్స్ డే' నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా ప్రకటించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ఈ ప్రజా వేదికను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నారు. నాయుడుపేట పట్టణ పరిధిలోని ప్రజలు తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధిలైట్లు, ఇంటి పన్ను, జన-మరణ ధృవపత్రాలు, పట్టాల సమస్యలు వంటి ఏ సమస్య ఉన్నా వినతిపత్రాల రూపంలో నేరుగా ఎమ్మెల్యే విజయశ్రీ గారికి అందజేయవచ్చని కమిషనర్ సూచించారు.

అన్ని శాఖల అధికారులు హాజరు:

ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు రెవెన్యూ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ వంటి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. దీంతో ప్రజలు అందించే అర్జీలను అక్కడికక్కడే సంబంధిత అధికారులకు అప్పగించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే విజయశ్రీ భరోసా ఇచ్చినట్లు సమాచారం. ప్రజా ప్రతినిధి నేరుగా ప్రజల వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకునే ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యల పరిష్కారానికి ఈ వేదికను వినియోగించుకోవాలని కమిషనర్ షేక్ ఫజులుల్లా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చేవారు తమ సమస్యలకు సంబంధించిన పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

# వికసిత్ భారత్ మిషన్ ఘనంగా ప్రారంభం

### 125 రోజుల ఉపాధి హామీ
### స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ప్రారంభం



మడకశిర, (పెన్ పవర్) జూలై 2: మడకశిర మండలం పరిధి లో సి.కోడిగేపల్లి గ్రామ పంచాయతీలో "వికసిత్ భారత్" కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు 125 రోజుల పని దినాలు కల్పించబడనున్నాయి. ఈ ప్రారంభోత్సవానికి మడకశిర శాసనసభ్యులు, టిటిడి పాలకమండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు పాల్గొన్నారు. తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ముక్కావారిపల్లెలో ఈ మిషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మడకశిర మండల అధ్యక్షులు కల్లుమర్రి నాగరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురు మూర్తి, క్లస్టర్ ఇంచార్జ్ రంగే గౌడ్, సింగిల్ విండో అధ్యక్షులు నరేష్ కన్నా, రొల్ల మండల పార్టీ అధ్యక్షులు ఈరన్న, పంచాయతీ సెక్రటరీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచుతూ, పంచాయతీల అభివృద్ధికి దారితీయడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం

# వీబీ జీరామ్‌జీతో మరింత మేలు - కలెక్టర్ టి.నిషాంతి



పాడేరు, పెన్ పవర్,జూలై02 సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అమలు చేసే వీబీ జీరామ్‌జీ (వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) పథకంతో ప్రజలకు మరింత మేలు జరుగుతుందని కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. మండలంలోని చింతలవీధిలో గురువారం వీబీ జీరామ్‌జీ పథకాన్ని ఆమె లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మరిన్ని సంస్కరణలు చేసి వీబీ జీరామ్‌జీ పథకంగా మార్పు చేశారన్నారు. దీంతో గతంలో కంటే అదనంగా ప్రజలకు మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయన్నారు. గతంలో ఒక కుటుంబానికి ఏడాదిలో 100 రోజులు కల్పించిన పని దినాలను ఇకపై 125 రోజులకు పెంచారని, రోజువారీ వేతనం సైతం రూ.275 నుంచి రూ.312లు చేశారన్నారు. ఈ పథకంలో కేవలం ఉపాధి కల్పనకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఉత్పాదకత ఆస్తుల నిర్మాణం లక్ష్యంగా చర్యలు చేపడతారన్నారు. జల సంరక్షణ, వనరుల నిర్వహణ, భూగర్భ జలాల పెంపు, జలధార-జలహారతి వంటి కార్యక్రమాలకు వీబీ జీరామ్‌జీ పథకాన్ని అనుసంధానిస్తారన్నారు. మౌలిక సదుపాయాలకు సంబంధించిన అనేక రకాల పనులు ఈ పథకంలో చేపడతారని తెలిపారు. ఎటువంటి దుర్వినియోగానికి అవకాశం లేకుండా ఈ-కేవైసీ ద్వారా నిరంతర పర్యవేక్షణ, నిఘా ఉంటుందన్నారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కలెక్టర్ సూచించారు.

పేదల ఆకలి తీర్చే పథకం

వీబీ జీరామ్‌జీ పథకం పేదల ఆకలి తీర్చే చక్కని పథకమని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు.

# నార్త్ రాజుపాళెం జెడ్పీహెచ్ఎస్‌ను అన్ని వసతులతో తీర్చిదిద్దుతాం

## గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పాఠశాలల్లో అరకొర వసతులు

వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా పాఠశాల అభివృద్ధికి రూ. 20 లక్షల వ్యయం

బడిలో 'వీపీఆర్ అమృతధార' వాటర్ ప్లాంట్ ప్రారంభం

అన్ని బడుల్లో విద్యార్థుల వద్దకే భోజనం తీసుకెళ్లి వడ్డించాలి

కొడవలూరు మండలంలో 8,438 మందికి 'వీపీఆర్ నేత్ర' సేవలు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





కోవూరు పెన్ పవర్ జూలై 2. గురువారం కొడవలూరు మండలం నార్త్ రాజుపాళెం గ్రామ పంచాయతీ పరిధిలోని జెడ్పీ హైస్కూల్‌లో అభివృద్ధి చేసిన తరగతి గదులు, వాటర్ ప్లాంట్‌ను కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాఠశాలను అన్ని మౌలిక వసతులతో తీర్చిదిద్ది, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తరఫున విద్యార్థులకు అంకితం చేస్తామని తెలిపారు.

గతంలో ఈ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్--టీచర్స్ మీట్‌కు హాజరైన సందర్భంగా స్కూలును పూర్తిగా పరిశీలించామని చెప్పారు. అప్పట్లో పాఠశాల అపరిశుభ్రంగా ఉండటంతో పాటు, లైబ్రరీని స్టోర్‌రూమ్‌గా మార్చడం, తరగతి గదులు సరిపోక ఒకే గదిలో రెండు, మూడు తరగతులను నిర్వహించడం గమనించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో 'నాడు--నేడు' పనులను అరకొరగా చేపట్టి వదిలేయడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకే అదే రోజు వీపీఆర్ ఫౌండేషన్, సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.15 లక్షలు అందజేస్తామని ప్రకటించామని, ప్రస్తుతం దాదాపు రూ.20 లక్షల వరకు ఖర్చు చేసినప్పటికీ ఇంకా కొన్ని పనులు మిగిలి ఉన్నాయని చెప్పారు. మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేసి పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. విద్యార్థులకు త్వరలో బెంచీలు, సైకిళ్లు కూడా అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

వీపీఆర్ అమృతధార

ఈ పాఠశాలలో సురక్షిత తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వాటర్ ప్లాంట్ మంజూరు చేశారని ఎమ్మెల్యే చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో వీపీఆర్ ఫౌండేషన్ 2017లో ప్రారంభించిన 'అమృతధార' కింద వాటర్ ప్లాంట్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద నెల్లూరు జిల్లాలో 200, కోవూరు నియోజకవర్గంలో 28 వాటర్ ప్లాంట్స్ అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. కోవూరు మండలంలో 6, బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 3, విడవలూరు మండలంలో 7, ఇందుకూరుపేట మండలంలో 8, కొడవలూరు మండలంలో 4 ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థుల వద్దకే భోజనం

రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మంచి పుస్తకాలు, యూనిఫారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ పాఠశాలలో విద్యార్థులు కిచెన్ నుంచి భోజనం తీసుకుని వరండాలో కూర్చుని తినడం గమనించానని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండకూడదన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థుల వద్దకే భోజనం తీసుకొచ్చి వడ్డించే విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోవూరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే విధానం అమలు కావాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు క్షేత్రస్థాయిలో ప్రతి విద్యార్థికి చేరేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని, పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడం ఉపాధ్యాయుల బాధ్యతగా భావించాలని అన్నారు.

వీపీఆర్ నేత్ర సద్వినియోగం చేసుకోండి

వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వీపీఆర్ నేత్ర' కార్యక్రమం ద్వారా ఉచిత కంటి పరీక్షలు,కళ్లజోళ్లు,అవసరమైనవారికి కంటి మెరుగు సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. ఇటీవల కొడవలూరు మండలంలో 24 రోజుల పాటు ప్రతి గ్రామంలో వీపీఆర్ నేత్ర బస్సు సేవలు అందించిందని తెలిపారు. మొత్తం 8,438 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, వారిలో 5,706 మందికి ఉచితంగా కళ్లజోళు అందజేశామని చెప్పారు. పరీక్షలు చేయించుకున్న వారిలో సుమారు 68 శాతం మందికి కంటి చూపు మెరుగు సేవలు అందించగలిగామని పేర్కొన్నారు. ప్రస్తుతం కోవూరు మండలంలో వీపీఆర్ నేత్ర సేవలు కొనసాగుతున్నాయని, ప్రజలంతా ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రజాసేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు.

# జనసేన పార్టీ కోసం పనిచేయడానికి ముందు కొస్తున్న నూతన శక్తి : సామినేని ఉదయభాను

## పవన్ కళ్యాణ్ పిలుపుకు కాకినాడ పార్లమెంట్ పరిధిలో విశేష స్పందన ఒక్క రోజులోనే 450 నిర్మాణ సారథుల దరఖాస్తులు స్వీకరణ







కాకినాడ. పెన్ పవర్,జూలై02 జనసేన పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చిన "నిర్మాణ సారథుల సమాచార సేకరణ" కార్యక్రమానికి కాకినాడ పార్లమెంట్ పరిధిలో విశేష స్పందన లభించింది. కాకినాడలోని హబ్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కాకినాడ పార్లమెంట్ పరిశీలకులు, ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను పర్యవేక్షణలో ఉత్సాహభరితంగా సాగింది. పార్టీ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో ఒక్క రోజులోనే ప్రత్యేక డెస్కుల ద్వారా 450 దరఖాస్తులు అందినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ నాయకత్వం, జనసేన పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని అన్నారు. సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో సామాన్య ప్రజలు సైతం "మేము సైతం" అంటూ ముందుకు రావడం పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ నిబద్ధత కలిగిన నాయకత్వంపై ప్రజల్లో ఉన్న అపారమైన నమ్మకమే ఈ అపూర్వ స్పందనకు ప్రధాన కారణమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత పటిష్టం చేసే దిశగా నిర్మాణ సారథుల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని, ప్రజాసేవ పట్ల అంకితభావం, క్రమశిక్షణతో ముందుకు వచ్చే ప్రతి ఒక్కరికీ జనసేన పార్టీలో సముచిత స్థానం, తగిన గుర్తింపు లభిస్తుందని సామినేని ఉదయభాను స్పష్టం చేశారు.

# వికసిత్ భారత్ జీ-రామ్ జీ - గ్రామీణ్" జాతీయ కార్యక్రమము కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్





విజయవాడ, పెన్ పవర్, జులై, 02, యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఎంఎన్ఆర్ఈజీఏ కేవలం 100 రోజుల ఉపాధికి మాత్రమే హామీ ఇచ్చిందని.. నేడు 'వికసిత్ భారత్–జీ రామ్ జీ' పథకం 125 రోజుల పనికి హామీ ఇస్తుందని తెలిపారు. ఇది కేవలం పనిదినాల పెరుగుదల మాత్రమే కాదని, ఆలోచనా విధానంలో మార్పు అని, ఎవరూ పనిలేకుండా మిగిలిపోకూడదనేదే లక్ష్యమని అన్నారు. ఈ కొత్త పథకం అమలులోకి వచ్చిన మొదటి రోజే దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు పని పొందారని, ఎంఎన్ఆర్ఈజీఏకు మరింత మెరుగైన రీతిలో 'వికసిత్ భారత్–జీ రామ్ జీ'గా అమలు చేస్తున్నామని ఆయన ప్రకటించారు.

కేంద్ర మంత్రి చౌహాన్, ఈ పథక ఆర్థిక అంశాలను వివరిస్తూ.. వికసిత్ భారత్–జీ రామ్ జీ పథకంలో మొదటి సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.95,000 కోట్లకు పైగా ఉంటుందని, రాష్ట్రాల 40% వాటాతో కలిపి వార్షిక వ్యయం సుమారు రూ.1.51 లక్షల కోట్లకు చేరుకుంటుందని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో ఈ పథకం కింద మొత్తం రూ.7.5 లక్షల కోట్ల వ్యయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ నిధులు దేశవ్యాప్తంగా 2.86 లక్షల పంచాయతీలకు చేరుతుంది, దీని ద్వారా ఒక్కో పంచాయతీకి ఏడాదికి సగటున రూ.2 కోట్లకు పైగా లభిస్తుందని, ఇది గ్రామాలలో ఉపాధిని పెంచడంతో పాటు శాశ్వత ఆస్తులను సృష్టిస్తుందని అన్నారు.

వికసిత్ భారత్–జీ రామ్ జీ పథకం కూలీల హక్కులకు చట్టబద్ధతను కల్పిస్తుందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. పని కోరిన ఏ కార్మికుడికైనా 15 రోజుల్లోగా ఉపాధి కల్పించడం తప్పనిసరి. నిర్దేశించిన సమయంలోగా పని కల్పించని పక్షంలో, ఆ కార్మికుడికి నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కార్మికుల కష్టాన్ని ఇకపై ఎవరూ దోపిడీ చేయలేరని, దీర్ఘకాలంగా ఉన్న వేతనాల ఆలస్య సమస్యను పరిష్కరించేందుకు, ఈ పథకం కింద కార్మికులకు ఆలస్యమైన వేతనాలను వడ్డీతో సహా చెల్లిస్తారని వెల్లడించారు. దీనివల్ల కార్మికులు తమ శ్రమకు పూర్తి విలువ పొందుతారని, పేదల సేవే దైవారాధనగా భావించే 'మోదీ మంత్రం' క్షేత్రస్థాయిలో ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు పరిపాలనా వ్యయాన్ని 6 శాతం నుంచి 9 శాతానికి పెంచినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. దీని కింద, గ్రామ ఉపాధి సహాయకులు, మేట్లు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది జీతభత్యాల కోసం రూ.13,000 కోట్లకు పైగా కేటాయించినట్లు తెలిపారు. గ్రామాల్లో కూలీలను, అభివృద్ధి పనులను పర్యవేక్షించే సిబ్బందికి సమయానికి పూర్తి వేతనం అందడం ఎంతో ముఖ్యమన్నారు. అప్పుడే వారు తప్పుదోవ పట్టకుండా ఉంటారని, వ్యవస్థ బలంగా ఉంటుందని అన్నారు. ఈ విధంగా.. ఈ పథకం కార్మికులను, పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.

ఏ గ్రామంలో ఏ పని చేయాలో ఢిల్లీ నుంచో, అమరావతి నుంచో నిర్ణయించరని శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. పనులను నిర్ణయించే అధికారం గ్రామ పంచాయతీ, గ్రామ సభకే ఉంటుందన్నారు. అంగన్‌వాడీ నిర్మించాలా, పాఠశాల, ఆసుపత్రి, రోడ్డు, వ్యవసాయ రహదారి, రైతు ఉత్పత్తిదారుల కార్యాలయం కోసం నిర్మాణం, చెరువు, జాక్ డ్యామ్, ఆనకట్ట లేదా ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించే గోడ వంటివి నిర్మించుకోవాలా? వద్దా? అనేది గ్రామస్థులే స్వయంగా నిర్ణయించుకుంటారని అన్నారు. ఈ నిర్ణయాలన్నీ గ్రామంలోనే కొలువుదీరిన గ్రామసభ ద్వారా తీసుకుంటారని, గ్రామ నిర్ణయం గ్రామంలోనే తీసుకుంటారని, ఇదే జీ–రామ్ జీ యోజన ఆత్మ అని అన్నారు.

ప్రగతిని వేగవంతం చేసేందుకు, రాష్ట్రాలు తమ పంచాయతీలను ఏ, బి, సి కేటగిరీలుగా విభజించి, అభివృద్ధిలో వెనుకబడిన వాటికి మరింత నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి చౌహాన్ సూచించారు. దీనివల్ల అంతర్గత, వెనుకబడిన ప్రాంతాల్లోని గ్రామాల్లో అభివృద్ధి

వేగవంతమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, వికసిత్ భారత్–జీ రామ్ జీ యోజన కింద కేవలం తొమ్మిది నెలల్లోనే కేంద్రం రూ.7,707 కోట్ల ప్రత్యేక గ్రాంటును అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాతో కలిపి ఈ ప్యాకేజీ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల సరసన నిలుపుతుందని, గ్రామాల్లో ఉపాధి, అభివృద్ధికి గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధికి ఒక ఆదర్శంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఏ రాష్ట్రంలోనూ ఇకపై వేతనాలు రూ.300 కంటే తక్కువ ఉండవని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ రేటును రూ.312 నుంచి రూ.315 మధ్య నిర్ణయించారు, తద్వారా కూలీలు తమ శ్రమకు పూర్తి విలువను పొందుతారని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గ్రామీణ రహదారుల శాఖకు భారీగా నిధులు -- వేదికపై నుంచే ఆమోద పత్రాల అందజేత యోజన–గ్రామీణ్ మరియు ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద ఆంధ్రప్రదేశ్‌లోని పేద కుటుంబాలు, గ్రామాలకు భారీ ప్రోత్సాహకాలను ప్రకటించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఆంధ్రప్రదేశ్‌కు 74,212 కొత్త పక్కా ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో అర్హులైన ప్రతి పేద కుటుంబం మంచి గృహవసతిని పొందుతారని అన్నారు. ఇంకా పక్కా రోడ్ల సౌకర్యం లేని గ్రామాల ఆందోళనలను కూడా ఆయన ప్రస్తావించారు. అటువంటి ప్రాంతాలలో 146 కొత్త రోడ్లు, 19 వంతెనల నిర్మాణానికి మొత్తం రూ.422 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. వేదికపై నుంచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఈ ఆమోద పత్రాలను అందజేస్తూ, గ్రామాలు అభివృద్ధి చెందేకొద్దీ భారతదేశం మారుతుందని, ఆంధ్రప్రదేశ్ సమగ్ర గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి లోటు రానివ్వదని శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తోతాపురి మామిడి రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ.. మామిడి ధరలు పడిపోవడం వల్ల రైతులు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారని, అందువల్ల రైతులకు సరసమైన ధర లభించేలా, కూలీలకు మంచి వేతనాలు అందేలా కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద తోతాపురి మామిడిని పెద్ద మొత్తంలో కొనుగోలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. దీనితో పాటు, మామిడి తోటల ఉత్పాదకతను పెంచడానికి, మార్కెట్లో మెరుగైన రకాలను అందుబాటులోకి తీసుకురావడానికి, ఐసీఏఆర్ శాస్త్రవేత్తల బృందం రాష్ట్ర ప్రభుత్వ బృందంతో కలిసి గ్రాఫ్టింగ్ మరియు రకాల మార్పిడి పద్ధతులపై పనిచేస్తుందని ఆయన తెలియజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతిజ్ఞ చేయాలని ప్రజలకు శివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపునిచ్చారు. తాను స్వయంగా ప్రతిరోజూ చెట్లు నాటుతానని, ప్రజలు కూడా తమ పుట్టినరోజున కనీసం ఒక చెట్టునైనా నాటాలని కోరారు. అభివృద్ధి చెందిన గ్రామం, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్, అభివృద్ధి చెందిన భారతదేశం కోసం వేదికపై నుంచి ప్రజల చేత సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. వికసిత్ భారత్– జీ రామ్ జీ యోజన గ్రామాలు, గ్రామీణ జీవన ప్రమాణాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తుంది ముఖ్యమంత్రి

చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. వికాసిత్ భారత్–జీ రామ్ జీ యోజన గ్రామాలలో మరియు గ్రామీణ జీవన ప్రమాణాలలో పరివర్తన తీసుకువచ్చే కార్యక్రమమని అభివర్ణించారు. గతంలో రాయలసీమ నుంచి ప్రారంభమైన ఎంఎన్ఆర్ఈజీఏ దేశానికి ఒక నమూనాని ఇచ్చిందని, ఇప్పుడు అదే ప్రాతిపదికన, మరింత శక్తివంతమైన రూపంలో వీబీ–జీ రామ్ జీ యోజనను ప్రారంభించామని, ఇది స్వర్ణాంధ్రప్రదేశ్, అభివృద్ధి చెందిన భారత్ దిశగా ఒక పెద్ద ముందడుగని అన్నారు. 125 రోజుల ఉపాధి హామీతో పాటు, వ్యవసాయ రోడ్లు, చెరువులు, డ్రైనేజీ వంటి పనులు, భూమిలేని కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం ద్వారా గ్రామీణ జీవన ప్రమాణాలు నేరుగా

మెరుగుపడతాయని అన్నారు.

ఈ కొత్త పథకంలో డిజిటల్ మాస్టర్ రోల్, ఆధార్ ఆధారిత చెల్లింపులు, రియల్ టైమ్ పర్యవేక్షణ, జియో–ట్యాగింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో పనులను పర్యవేక్షిస్తుందని శ్రీ చంద్రబాబు నాయుడు అన్నారు. దీనివల్ల, పని చేయకుండా కాగితాల మీద లెక్కలు చూపించే పాత పద్ధతికి స్వస్తి కలుగుతుందని, నిధులు సరైన చోట ఖర్చు అవుతుందని తెలిపారు. ఇటీవలి సంవత్సరాలలో శ్రీ పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో జరిగిన గ్రామ సభలు, సీసీ రోడ్లు, గోశాలలు, నీటి ట్యాంకులు, పంపు పాండ్ లు, గిరిజన ప్రాంతాల్లో నిర్మించిన రహదారులను ప్రస్తావిస్తూ, ఈ అనుభవాల ఆధారంగా వీబీ–జీ రామ్ జీ పథకాన్ని సాధ్యమైనంత ఉత్తమంగా అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తన దార్శనికతను ముఖ్యమంత్రి పంచుకున్నారు. నీటిపారుదల ప్రాజెక్టులు, రోడ్డు అనుసంధానం, గిడ్డంగులు, మౌలిక సదుపాయాల ద్వారా దేశంలో పండ్లు, ఉద్యానవన పంటలకు రాయలసీమను ఒక ప్రధాన కేంద్రంగా మార్చేందుకు, పూర్వోదయ కార్యక్రమం కింద సుమారు రూ.40,000 కోట్ల ప్రభుత్వ పెట్టుబడులు, సుమారు రూ.60,000 కోట్ల ప్రైవేట్ పెట్టుబడిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ దార్శనికతను స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా ఒక నిర్ణయాత్మక అడుగుగా అభివర్ణిస్తూ, గ్రామీణ ఉపాధి, ఉద్యానవనం, పారిశ్రామిక పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు అన్నీ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో దోహదపడతాయని వెల్లడించారు. అమరావతిని దేవతల రాజధానిగా అభివర్ణిస్తూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాజధాని ప్రాజెక్ట్, పోలవరం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, డేటా సెంటర్, ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ వంటి ప్రాజెక్టుల ద్వారా ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్ మళ్లీ ఉన్నత స్థాయికి తీసుకెళ్లినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. సరైన నాయకుడు, సరైన ప్రదేశం, సరైన సమయం -- ఇదే నరేంద్ర మోదీ అని, 2047 నాటికి భారతదేశాన్ని నంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దాలనే దార్శనికతతో స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా పనులు వేగంగా పురోగమిస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని మాట్లాడుతూ.. వీబీ జీ–రామ్ జీ యోజన కింద పనిదినాలను 100 నుంచి 125కు పెంచడమే కాకుండా, పని లభించని పక్షంలో నిరుద్యోగ భృతికి కూడా నిబంధన ఉందని అన్నారు. దీనివల్ల ప్రతి కార్మికుడికి పని లభిస్తుందని ఆయన తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ మాట్లాడుతూ, వీబీజీ రామ్ జీ యోజన అభివృద్ధి చెందిన భారతదేశానికి పునాది అవుతుందని అన్నారు. ఈ పథకం కింద 300కు పైగా రకాల పనులు ఉంటాయని, ఇవి గ్రామీణ భారతదేశాన్ని సాధికారత కల్పించి, సుసంపన్నం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి రోహిత్ కన్సల్, సంయుక్త కార్యదర్శి రోహిణి ఆర్. భజిభకరే కూడా పాల్గొన్నారు. కేంద్రం మద్దతుతో ఆంధ్రప్రదేశ్ బలోపేతం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "శివరాజ్ జీ, మీ 49 ఏళ్ల ప్రజా జీవితం ప్రజా సేవకు, రైతుల పట్ల, గ్రామీణ భారతదేశం పట్ల మీకున్న అంకితభావానికి ప్రతీక. మీరు ఆరు సార్లు పార్లమెంట్ సభ్యునిగా, నాలుగుసార్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా దేశానికి సేవ చేసి స్ఫూర్తిదాయకమైన ఆదర్శాన్ని నెలకొల్పారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి మీరు చేసిన పోరాటం, మీరు జైలుపాలవడం మా అందరికీ స్ఫూర్తిదాయకం. మీ మార్గదర్శకత్వం, ప్రధానమంత్రి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధికి రూ.12,845 కోట్ల మంజూరైంది. మీ సహకారంతో రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం కాగా, గిరిజన ప్రాంతాల్లో మొక్కల పెంపకంతో సహా అనేక ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్టులు పురోగమించాయి.

# అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉంటూరు ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్



గుంటూరు, పెన్ పవర్,జూలై 2 : అర్హత కలిగిన ప్రతి ఓటరు వాటర్ జాబితాలో ఉంటారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ అన్నారు. ఓటరు ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో భాగంగా గృహ మ్యాపింగ్ పక్కాగా చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను గుంటూరు పట్టణం పశ్చిమ నియోజక వర్గం శాంతి నగర్ 181 పోలింగ్ కేంద్రం, అంకమ్మ నగర్ 179 పోలింగ్ కేంద్రాల పరిధిలో గురువారం సి.ఇ.ఓ పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారులతో మాట్లాడి, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను ఏ విధంగా చేపడుతున్నదిహోతెలుసుకున్నారు. అనంతరం గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎ.ఇ.ఆర్ లతో చర్చించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అపార్టుమెంట్ల వద్ద ఓటరు నమోదుకు అపార్టుమెంట్ల సంఘాలతో సమన్వయంతో పనిచేసి ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. బూత్ స్థాయి అధికారి తో “బుక్ ఎ కాల్” వ్యవస్థ ద్వారా ఓటర్ల సందేహాలను నివృత్తి చేయుటకు కృషి చేయాలన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యక్షంగా లేనివారు (ఆబ్సెంట్), ఇతర ప్రాంతాలకు వెళ్ళినవారు (షిఫ్టెడ్), మరణించినవారు (డెడ్), డూప్లికేట్, ఇతర దేశస్థులు (ఫారినర్ లు) క్రింద ఉన్న ఓటర్లు మినహా అందరూ ఓటరు జాబితాలో ఉండాలని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమ చేపడుతున్నామని వివరించారు. ప్రక్రియ వేగవంతం చేయుటకు బూత్ స్థాయి అధికారికి సహాయకులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# వృథాగా షాపింగ్ కాంప్లెక్స్‌లు

(అనకాపల్లి–పెన్ పవర్,జూలై02జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి పట్టణాల్లో స్థానిక సంస్థలకు అదనపు ఆదాయం కోసం నిర్మించిన వాణిజ్య దుకాణ సముదాయాలను అధికారులు పట్టించుకోవడంలేదు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్సులు ఆశించిన మేర ఆదాయం తీసుకురాకపోగా, నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. వాణిజ్య సముదాయాల్లో కొన్ని దుకాణాలను అద్దెకు తీసుకున్న వారు అద్దెలు సరిగా చెల్లించడం లేదు. దీంతో బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోయాయి. మిగిలిన దుకాణాలు నెలల తరబడి ఖాళీగా పడివుంటున్నాయి.

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అనకాపల్లి జోన్ పరిధిలో అధికారుల గణాంకాల ప్రకారం 14 వాణిజ్య సముదాయాలు, వాటిలో 160 దుకాణాలు ఉన్నాయి. 10 దుకాణాలు శిథిలావస్థలో ఉండగా, 49 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 101 షాపుల్లో లీజుదారులు వున్నారు. దుకాణాల అద్దెల ద్వారా జీవీఎంసీకి ఏటా రూ.2 కోట్లకు పైగా ఆదాయం రావాలి. కానీ రూ.కోటి మాత్రమే వస్తున్నది. చిన్న నాలుగు రోడ్ల జంక్షన్‌లో 25 దుకాణాలు ఉండగా వాటిలో 7 దుకాణాలను మాత్రమే అద్దెకు ఇచ్చారు.

# రోడ్డు కోసం ఎదురుచూపులు.



బాపట్ల :( పెన్ పవర్) జూలై 02 బాపట్ల ఆర్టీసీ డిపోకు వెళ్లే ప్రధాన రహదారి చాలా కాలంగా అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై కేవలం చిప్స్ వేసి వదిలేయడంతో ఇప్పటి వరకు బిటుమిన్ రోడ్డు వేయలేదు. ఫలితంగా భారీ వాహనాలు, లారీలు వెళ్లే సమయంలో దుమ్ము మేఘాలు ఎగసిపడి ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ మార్గంలో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రోడ్డు పూర్తికాకపోవడంతో దుమ్ము వల్ల వాహనదారులకు దారి కనిపించక ప్రమాదాల భయం నెలకొంది. రోడ్డు పక్కన ఉన్న ఇళ్లలోకి, వ్యాపార సంస్థల్లోకి దుమ్ము చేరి ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడో ప్రారంభించిన రోడ్డు పనులు ఎందుకు నిలిచిపోయాయో తెలియడం లేదని, వెంటనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా బాపట్ల మున్సిపల్ అధికారులు ఈ రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మావిగన్ ప్రతిపాదన జగన్ కు భస్మాసుర హస్తమే. : ప్రత్తిపాటి

**జగన్ అనాలోచిత నిర్ణయంపై వైసీపీనేతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.**

**భూములు త్యాగం చేసిన రైతులపై కక్షసాధింపులకు పాల్పడుతున్న ఏకైక నాయకుడు దేశంలో జగన్ ఒక్కడే.**





చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 02 : నాదెండ్ల : రాష్ట్ర రాజధాని కోసం తమ భూములు త్యాగం చేసిన రైతులపై ఏ నాయకుడు, ఏ పార్టీ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడిన దాఖలాలు లేవని, అలాంటి నాయకుడు దేశంలో జగన్ ఒక్కడేనని, తన మావిగన్ ప్రతిపాదన జగన్ పాలిట శాపంగా మారుతుందని, భస్మాసుర హస్తంలా తనను, తన పార్టీనే దహిస్తుందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. గురువారం ఆయన నాదెండ్ల మండలం అప్పాపురంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, స్థానిక నాయకులతో కలిసి వీబీ జీ రామ్ జీ పథకాన్ని ప్రారంభించారు. పథకం కింద చేపట్టిన పనులు పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు.

'మావిగన్' తో వైసీపీ రాజకీయ మనుగడకే ముప్పు.

జగన్ మావిగన్ ప్రతిపాదనపై ప్రజలకంటే ఎక్కువగా సొంతపార్టీనేతలే నవ్వుతున్నారని, ఏమాత్రం ఆలోచన లేకుండా జగన్ ప్రకటించే నిర్ణయాలతో వైసీపీనాయకులే దిక్కుతోచని స్థితిలో పడుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు. జగన్ నిర్ణయంతో తమ రాజకీయ భవిష్యత్ ఏమవుతుందోనన్న భయం వారిని పీడిస్తోందన్నారు. తమ నాయకుడి అనాలోచిత నిర్ణయాలపై వైసీపీనేతలు విబేధించకుంటే, వారి రాజకీయ భవిష్యత్ ఎప్పటికీ అంధకారమేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి గుండెకాయ అయిన రాజధాని నిర్మాణానికి తమ భూములు త్యాగం చేసిన రైతులపై కక్షసాధింపులకు పాల్పడుతున్న ఏకైక నాయకుడు దేశంలో జగన్ ఒక్కడేనని ప్రత్తిపాటి అసహనం వ్యక్తంచేశారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజలకు ఉపయోగపడే రాజధాని నిర్మాణంపై జగన్ దుష్ప్రచారం చేయడం తగదన్నారు. జగన్ తన మావిగన్ దురాలోచన మానుకోకుంటే.. వైసీపీ రాజకీయ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. తన ప్రతిపాదన భవిష్యత్ లో జగన్ కే శాపంగా మారబోతోందన్నారు.

'వీబీజీ రామ్ జీ' తో రాష్ట్రానికి భారీ లబ్ధి.. గ్రామాల అభివృద్ధి : ప్రత్తిపాటి

నరేగా స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీజీ రామ్ జీ పథకంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని ప్రత్తిపాటి తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు... రైతులు, రైతు కూలీలకు ఆర్థికంగా ఉపాధి లభిస్తుందన్నారు. పంట కాలువలు, కుంటలు, చెరువుల నిర్మాణం, ఆధునికీకరణతో నీటివనరుల లభ్యత పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వీబీజీ రామ్ జీ పథకం ద్వారా 12వేల కోట్ల విలువైన పనులు కేటాయించిందని, వాటి సద్వినియోగం అందరి బాధ్యతని ప్రత్తిపాటి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని కృషి, నిరంతర సంప్రదింపుల వల్లే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం వీబీజీ రామ్ జీతో రాష్ట్రానికి భారీ లబ్ధి చేకూరనుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఇప్పటికే కూటమిప్రభుత్వ సంక్షేమ పథకాలతో మెరుగపడిన గ్రామీణ ప్రజల ఆర్థిక జీవనానికి, ఈ పథకం మరింత మేలు చేస్తుందన్నారు.

గ్రామసభల ద్వారా ప్రజాభిప్రాయంతోనే పనులు చేపడతాం : కలెక్టర్ కృతికా శుక్లా

నరేగాపరిధిలో ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటినీ ఇకనుంచి వీబీజీ రామ్ జీ పథకం పరిధిలోకి తీసుకు రానున్నట్టు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా వెల్లడించారు. వచ్చే రెండు వారాల్లో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామసభలు నిర్వహించి, ప్రజాభిప్రాంయతోనే ఆయా గ్రామాల్లో పథకం కింద చేపట్టాల్సిన పనుల్ని నిర్ధారిస్తామని ఆమె తెలిపారు. జలధార–జలహారతి కింద చేపట్టిన రూ.30 కోట్ల విలువైన పనుల్ని కూడా వీబీజీ రామ్ జీ పథకంకిందే పూర్తిచేస్తామన్నారు. గతేడాది నరేగా పరిధిలో జిల్లాకు 58 లక్షల పనులు మంజూరైతే, ఈ ఏడాది ఇప్పటికే 34 లక్షల పనులు పూర్తిచేసినట్టు కలెక్టర్ తెలిపారు.

కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, గొట్టిపాటి రామరావు, జగదీష్, మస్తాన్ వలి, అయోధ్య, డ్వామా పిడి సిద్ధ లింగమూర్తి, ఐసీడీఎస్ పిడి, ఆర్.డబ్ల్యుయాస్ పిడి, హౌసింగ్ పిడి, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దూకుడు పెంచిన సివిల్ సప్లై అధికారులు





బాపట్ల:( పెన్ పవర్) జూలై 02 బాపట్ల ఇటీవల సివిల్ సప్లై కమిషనర్ కన్నబాబు బాపట్ల జిల్లాలో పర్యటించిన సందర్భంగా జిల్లా సివిల్ సప్లై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో బియ్యం అక్రమ రవాణా జరుగుతోందనే అంశంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న జిల్లా సివిల్ సప్లై అధికారులు ప్రస్తుతం తనిఖీలను ముమ్మరం చేశారు. చౌక ధరల దుకాణాలు, బియ్యం నిల్వలు, రవాణా వాహనాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా బాపట్ల నియోజకవర్గంలో రెండు రోజుల నుండి తనిఖీలు ముమ్మరం చేసి కేసులు నమోదు చేస్తున్నారు. గురువారం ఉదయం ఏకంగా రవాణా చేస్తున్న వ్యాన్ ను జమేధర్ పేట పాత మసీదు ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. ఆకాశ రామన్న అందించిన సమాచారం మేరకు ఉదయం 4:30 గంటలకు తనిఖీలు జరిపారు.జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా అమలు చేయడంతో పాటు పేదలకు అందాల్సిన బియ్యం అక్రమంగా తరలిపోకుండా నిరోధించడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపార

# మావిగన్' వ్యాఖ్యలతో జగన్ తన గొయ్యి తానే తవ్వుకుంటున్నారు సీపీఐ జంగాల అజయ్ కుమార్



గుంటూరు, పెన్ పవర్,జూలై, 02, మావిగన్' రాజధాని పేరుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయంగా తన గొయ్యి తానే తవ్వుకునేలా ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. గురువారం గుంటూరు సిపిఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని విభజించే ప్రయత్నం చేసిన జగన్, ఇప్పుడు మరోసారి అమరావతిని దెబ్బతీసేలా మాట్లాడటం బాధాకరమన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినప్పటికీ జగన్ తన వైఖరిని మార్చుకోకపోవడం విచారకరమని అన్నారు. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని సీపీఐ మొదటి నుంచీ ఒకే విధానానికి కట్టుబడి ఉందని, రాజధాని రైతుల ఉద్యమాలకు పార్టీ నిరంతరం అండగా నిలిచిందని తెలిపారు. ఇదే ధోరణి కొనసాగితే 2029 ఎన్నికల్లోనూ ప్రజలు జగన్‌ను తిరస్కరిస్తారని, ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని జంగాల అజయ్ కుమార్ సూచించారు.

# ప్రభుత్వ ఎల్.ఓ.సీలతో పేదలకు ఖరీదైన, నాణ్యమైన వైద్యసేవలు : ప్రత్తిపాటి

**5 గురు అనారోగ్య బాధితులకు రూ.7.72 లక్షల విలువైన ఎల్.ఓ.సీలు, సీఎం.ఆర్.ఎఫ్ లు అందచేసిన ప్రత్తిపాటి.**



చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 02 : చిలకలూరిపేట: కూటమిప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అనారోగ్య సమస్యలపై వారందించే విజ్ఞప్తులను వెంటనే పరిష్కరిస్తోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.గురువారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఐదుగురికి ప్రభుత్వం మంజూరు చేసిన ఎల్.ఓ.సీలు (లెటర్ ఆఫ్ క్రెడిట్), సీఎం.ఆర్.ఎఫ్ లు అందించారు.

ఎల్.ఓ.సీలు పేదల ప్రాణాలు రక్షించే సాధనాలు..

ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని వ్యాపార వస్తువుగా చూస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆరోగ్య రక్షణకు అన్నివిధాల అండగా నిలుస్తున్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు తమకు ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధుల కోసం ఎక్కడా అప్పులు చేయాల్సిన పనిలేకుండా ప్రభుత్వం ఎల్.ఓ.సీలు, సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు అందిస్తోందని ప్రత్తిపాటి చెప్పారు. దీనివల్ల పేద కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోకుండా వారికి తగిన చేయూత లభిస్తుందన్నారు. చంద్రబాబు అందించే ఎల్.ఓ.సీలు పేదల ప్రాణాలు రక్షించే గొప్ప సాధనాలని, వాటితో ఖరీదైన వైద్య చికిత్సలు, సేవలు ప్రజలకు సులభంగా లభిస్తాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, వజ్జ సింగయ్య, జయప్రసాద్, షేక్ మజారుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# 31.71 శాతం మేర పూర్తయిన ఫారాల డిజిటైజేషన్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, పెన్ పవర్, జూలై, 02, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాలో కచ్చితత్వం ఎన్నికల ప్రక్రియకు అత్యంత కీలకమని, అర్హులైన ఏ ఒక్క ఓటరూ జాబితా బయట లేకుండా.. అనర్హులెవరూ జాబితాలో లేకుండా స్వచ్ఛమైన, సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.గురువారం కలెక్టర్ లక్ష్మీశ ఎ.కొండూరు మండలం, రామచంద్రాపురం గ్రామంలో పర్యటించారు. బీఎల్‌వోల ద్వారా జరుగుతున్న ఇంటింటి సందర్శన ప్రక్రియను పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటైజేషన్ దశలను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కార్యక్రమం విజయవంతానికి బీఎల్‌వోలు, క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 16,68,565 (97.38 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జరిగిందని, అదేవిధంగా 5,43,350 (31.71 శాతం) ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన ఫారాల పంపిణీని పూర్తిచేయడంతో పాటు డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. తిరువూరులో 2,02,658 (97.1 శాతం), విజయవాడ పశ్చిమ 2,51,087 (97.71 శాతం), విజయవాడ సెంట్రల్ 2,70,004 (97.19 శాతం), విజయవాడ తూర్పు 2,63,563 (97.71 శాతం), మైలవరం 2,75,433 (96.59 శాతం), నందిగామ 2,00,541 (96.66 శాతం), జగ్గయ్యపేట 2,05,279 (98.9 శాతం) మేర ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వివరించారు. బీఎల్‌వోలు, అధికారులు ఈసీఐ నియమనిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా నిబద్ధతతో సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# ఏపీ సర్కార్ కీలక నిర్ణయం.. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంపు

అమరావతి, పెన్ పవర్, జూలై2: పీఎస్‌యూలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగులకు సంబంధించిన పదవీ విరమణ వయసుపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 60 ఏళ్ల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన తీర్మానానికి అనుగుణంగా సర్కార్ ఈరోజు(గురువారం) ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ నిర్ణయం 2022 జనవరి 1 నుంచి రిట్రోస్పెక్టివ్‌గా అమలు కానుంది. అలాగే, 60 ఏళ్ల వయసులో పదవీ విరమణ పొందిన అర్హులైన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునే అవకాశం ఉంది. మళ్లీ జాబ్‌లో చేరే వరకు ఉన్న గ్యాప్ పీరియడ్‌కు జీతం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్యాప్ పీరియడ్‌ను సీనియారిటీ, ప్రమోషన్ల కోసం పరిగణనలోకి తీసుకోరని పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు 62 ఏళ్ల వరకు పనిచేసిన ఉద్యోగులకు పూర్తి స్థాయి సర్వీస్ బెనిఫిట్స్ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# వేతనం రూ. 307 నుంచి రూ. 312కు పెంచుతూ ఆర్థిక చేయూత

## జిల్లాకలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

విజయవాడ, పెన్ పవర్, జూలై, 02, స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ ఏ 2047 దార్శనికతకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సరికొత్తగా రూపుదిద్దుకుంటున్నాయని, ఇందులో భాగంగా అమల్లోకి వచ్చిన వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ – గ్రామీణ్)తో శ్రమజీవుల ఉపాధికి సరికొత్త భరోసా లభిస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం జి.కొండూరు మండలం, చెవుటూరులో జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో జరిగిన వీబీ జీ రామ్ జీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. బండ్ల వాగు ఫీడర్ ఛానల్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభించిన అనంతరం జి.కొండూరు కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ముక్కావారిపల్లెలో గౌరవ కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్న కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గ్రామీణ కుటుంబాల ఆర్థికాభివృద్ధి, జీవనోపాధి భద్రత, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వీబీ జీ రామ్ జీ పథకం దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో అవసరాలను గుర్తించి, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ పనిదినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడంతో పాటు రోజువారీ వేతనాన్ని రూ.307 నుంచి రూ.312కు పెంచడం ద్వారా గ్రామీణ శ్రామిక కుటుంబాలకు అదనపు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు భూగర్భ జలాల పెంపునకు కూడా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. సమాజానికి, గ్రామానికి, శ్రామికులకు కూడా ఈ పథకం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. అర్హులైన వారికి జాబ్ కార్డులు అందించడంతో పాటు పూర్తిస్థాయిలో వేతనం లభించేలా పనులు చేపట్టి, అవి జరిగేలా చూడనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. గ్రామీణ



భారతం.. ఆర్థికంగా బలోపేతం: శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ వీబీ జీ రామ్ జీ పథకంతో గ్రామణ భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని.. శ్రామికులకు సుస్థిర ఉపాధితో పాటు బహుళ ప్రయోజనాల మౌలిక వసతుల అభివృద్ధికి వీలవుతుందని శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. శ్రామికులకు మంచి ఉపాధి కల్పించడంతో పాటు గ్రామీణ డొంక రోడ్లు, కాలువలు, వర్షపు నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులను ప్రాధాన్యత ఆధారంగా చేపట్టి గ్రామాలను స్వయం సమృద్ధి దిశగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ, డ్వామా పీడీ ఎ.రాము, ఏపీడీ (విజయవాడ) శ్రీనివాస్, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమర్, ఎంపీడీవో రామకృష్ణ, తహశీల్దార్ రిబ్కా రాణి, స్థానిక నాయకులు, ఉపాధి హామీ శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ తో పేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నాం ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, పెన్ పవర్, జులై, 02, మావిగన్ మాయమాటలు ఇంకెన్నాళ్ళు చెబుతావు జగన్ ? అమరావతి రాజధాని ప్రజల మనోభావాలతో ఇంకెన్నాళ్లు ఆడుకుంటావు ? అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట్ట వేస్తున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి 96 మందికి రూ.1.35 కొట్ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్లలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు రూ.14 కోట్ల విలువైన సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలిచామని తెలిపారు. నాలుగు రోజుల క్రితం కిడ్నీ సమస్యతో బాధపడుతున్న 20 ఏళ్ల షేక్ మస్తాన్ అనే యువకుడికి ఎల్ఓసి ద్వారా నాలుగు లక్షల రూపాయలకుపైగా



నిధులు ఒక్క రోజులో అందేలా చేశామని, ఇది పేదల ప్రభుత్వమని చెప్పారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టమొచ్చినా తమ ఆఫీసులో సంప్రదిస్తే వెంటనే స్పందిస్తున్నామని అన్నారు. 2019 ఎన్నికలకు ముందు తాను రాజధాని ప్రాంతంలోనే ఇల్లు నిర్మించుకొని ఉంటానని, అమరావతికి మద్దతుగా నిలుస్తానని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు రాజధానుల పేరిట మూడుముక్కలాట మొదలుపెట్టారని విమర్శించారు. ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త నాటకం అడుతున్నారని చెప్పారు. వైసీపీకి చేతనైతే ప్రజా సమస్యలపై అసెంబ్లీలోకి వచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమరావతి రాజధానిని దేశంలోనే నంబర్ వన్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టిందని, దీనిని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు.

# రెండు సెంట్ల ఇంటి స్థలం సాధించేంత వరకు సిపిఐ పోరాటం ఆగదు

గుంటూరు, పెన్ పవర్, జులై, 02, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో నేడు మల్లయ్యలింగం భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ గుంటూరు నగర కార్యదర్శి అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ఉచితంగా అందజేస్తామని, అలాగే ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిందని విజయోత్సవ సంబరాలు నిర్వహించుకున్నటువంటి కూటమి ప్రభుత్వం, నాయకులు ప్రజలకు ఇచ్చినటువంటి హామీల అమలులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. గుంటూరు నగరంలో వేలాది నిరుపేద కుటుంబాలు ఇప్పటికీ సొంత ఇంటి స్థలం లేక అద్దె ఇళ్లలో జీవనం కొనసాగిస్తూ అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న పేద ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. పేదల గృహ హక్కు రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఆ హక్కును సాధించే వరకు సిపిఐ ప్రజల పక్షాన నిరంతర పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. గుంటూరు నగరంలో ఇంటి స్థలాలకు అర్హులైన పేదల నుంచి జూలై 3వ తేదీ నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వినతిపత్రాలు) రాయించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి అర్హత కుటుంబానికి ఇంటి స్థలం వచ్చే వరకు ఈ ఉద్యమాన్ని



మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. అలాగే జూలై 20వ తేదీన గుంటూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట వేలాది మంది పేదలతో కలిసి మహా ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత విస్తరిస్తామని హెచ్చరించారు. గుంటూరు నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు మాట్లాడుతూ ప్రజలు ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని, అర్హులైన పేదలందరూ ఇంటి స్థలాల కోసం చేపట్టనున్న దరఖాస్తుల కార్యక్రమంలో పాల్గొని తమ హక్కును సాధించుకునేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఈ నెల 3న విజయవాడ తూర్పులో ప్రత్యేక గ్రీవెన్స్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్, జులై, 02, ఈ నెల 3వ తేదీ శుక్రవారం విజయవాడ తూర్పు నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్‌లోని కోగంటి రామయ్య తులశమ్మగార్ల ఏపీఐఐసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారి కళ్యాణమండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని స్థానిక ప్రజల నుంచి అధికారులు అర్జీలను ఉదయం 10 గంటల నుంచి స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ



కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారని ప్రజల సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి పరిష్కార చర్యలు చేపడతారని పేర్కొన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

# తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించిన తనపై వైసీపీ సోషల్ మీడియాలో కించపరుస్తూ పోస్టులు పెట్టడం బాధాకరం -- ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, పెన్ పవర్, జులై, 02, తిరుమల శ్రీవారికి భక్తిపూర్వకంగా తలనీలాలు సమర్పించిన తనపై వైసీపీ సోషల్ మీడియా వేదికగా అవమానకర పోస్టులు పెట్టడం అత్యంత బాధాకరమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు ఆంధ్రరాష్ట్ర కౌరవుల మాదిరిగా వ్యవహరిస్తూ మహిళలను కించపరచడాన్ని రాజకీయాలుగా భావిస్తున్నారని గళ్ళా మాధవి విమర్శించారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ..మహిళల పట్ల గౌరవం లేని వైసీపీ నాయకత్వం రాష్ట్రానికి ప్రమాదకరమని, హోంమంత్రి వంగలపూడి అనిత పై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమని, అలాంటి వ్యాఖ్యలను ఖండించాల్సిన వైసీపీ మహిళా నాయకులు వాటిని సమర్థించడం మరింత దురదృష్టకరమని అన్నారు. రాజకీయాల్లో విధానాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేయడం సహజమని, అయితే మహిళల వ్యక్తిగత జీవితం, రూపురేఖలు, అలంకరణ, దుస్తులు, భక్తి విశ్వాసాలు వంటి అంశాలను లక్ష్యంగా చేసుకుని మాట్లాడడం వైసీపీ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని గళ్ళా మాధవి మండిపడ్డారు. ఒక మహిళా ఎమ్మెల్యే లేదా మంత్రి గురించి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడం, వారి గౌరవాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతో ప్రచారం చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని గళ్ళా మాధవి పేర్కొన్నారు. మహిళలను అవమానించడం ద్వారా వారిని రాజకీయంగా వెనక్కి నెట్టవచ్చని భావించడం వారి అవివేకమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. తిరుమలలో తలనీలాలు సమర్పించడం తన వ్యక్తిగత భక్తి విశ్వాసానికి సంబంధించిన విషయమని, దానిని కూడా రాజకీయ విమర్శలకు వాడుకోవడం వైసీపీ నాయకుల ఆలోచనా స్థాయిని చూపిస్తోందని వ్యాఖ్యానించారు. వైసీపీ నేతలు ప్రజా సమస్యలు లేదా అభివృద్ధి అంశాలపై చర్చించకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం బాధాకరమన్నారు. హోంమంత్రి వంగలపూడి అనితను కించపరిచిన గుడివాడ



అమర్నాథ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. మహిళా కమిషన్ ముందు హాజరయ్యే పరిస్థితి వచ్చినా కూడా తన వ్యాఖ్యలను సమర్థించుకోవడం సరికాదన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు సహించరని హెచ్చరించారు. మహిళా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని సమర్థిస్తున్న వైసీపీ మహిళా నేతలు తమ వైఖరిని పునఃపరిశీలించుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి మహిళ స్త్రీత్వాన్ని, గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రాష్ట్రంలోని మహిళలందరూ ఇలాంటి వ్యాఖ్యలను ఖండించాలని, హోంమంత్రి వంగలపూడి అనితకు సంఘీభావంగా నిలవాలని గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. మహిళలను అవమానించే రాజకీయ సంస్కృతిని ప్రజలు తిరస్కరించాలని, గౌరవప్రదమైన రాజకీయాలకు మద్దతు ఇవ్వాలని గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.

# యడ్లపాడు లో 'విబీ జీ రామ్ జీ'పథకం ప్రారంభం.

## కాలువల పూడికతీత పనులు ముమ్మరం..

చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 02 : యడ్లపాడు : మండలం కొత్తపాలెం గ్రామంలో 'విబీ జీ రామ్ జీ' పథకాన్ని అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా గ్రామంలోని సాగునీటి కాలువలలో పేరుకుపోయిన పూడికను తొలగించే పనులను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల ఎంపీడీవో హేమలతాదేవి మాట్లాడుతూ,ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సాగునీటి కాలువల నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు



తెలిపారు.కాలువల పూడికతీత పనులు వేగవంతం చేయడం ద్వారా రాబోయే రోజుల్లో నీటి పారుదల సజావుగా సాగుతుందని,ఇది రైతులకు ఎంతో మేలు చేస్తుందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ సుందర్రావు, టిఏ మాధవి,స్థానిక తెదేపా నాయకులు,సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 02 : నాదెండ్ల : మండలం ఇర్లపాడులోని కేంద్రీయ విద్యాలయం ముఖద్వార నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. అప్పాపురంలో వీబీజీ రామ్ జీ పథకం ప్రారంభించిన అనంతరం ఆయన ఇర్లపాడులో పర్యటించి, జరుగుతున్న అభివృద్ధి పనుల్ని పరిశీలించారు. గ్రామ నాయకులతో కలిసి రూ.15 లక్షలతో నిర్మించనున్న ముఖద్వారనిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు,

మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు గుర్రం నాగ పూర్ణచంద్రరావు, వజ్జ సింగయ్య, జయప్రసాద్, రంగనాథుల నాగేశ్వరరావు, కృష్ణమ నాయుడు, రామాంజీ, జ్యోతి, పంచాయతీ రాజ్ డి.ఈ బాల కుమార్, ఏ.ఈ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# భట్టిప్రోలులో ఘనంగా వికసిత్ భారత్ గ్రామ అభియాన్ ప్రారంభం

భట్టిప్రోలు, పెన్ పవర్ (జులై, 02) మండల కేంద్రమైన భట్టిప్రోలు గ్రామంలో వికసిత్ భారత్-గ్యారెంటీ రోజుగా అజీరికా మిషన్ గ్రామీణ్ పథకంను మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఎస్ వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా లు ఇరువురు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను ప్రారంభించి అక్కడ పనులు చేస్తున్న కార్మికులతో కలిసి వారి ఇరువురు స్వయంగా పనులు చేశారు కార్మికులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధ్యాయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు ఇరువురు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అమలు చేస్తున్న వికసిద్భారత్ గ్రామ అభియాన్ గ్రామీణ అభివృద్ధికి నూతన దశను



చూపించే ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన జీవనోపాధి అవకాశాల పెంపు సంక్షేమ కార్యక్రమాల విస్తరణ నీటి సంరక్షణ గ్రామీణ రహదారులు పర్యావరణ పరిరక్షణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ఈ అభియాన్ ద్వారా మరింత వేగం చేకూరుతుందని వారు తెలిపారు. అర్హులైన గ్రామీణ కుటుంబాలకు సంవత్సరానికి 125 రోజుల ఉపాధి హామీ కల్పించడంతోపాటు, గ్రామాన్ని స్వావలంబన దిశగా తీసుకు వెళ్ళటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ యం రవికుమార్,ఫీల్డ్ అసిస్టెంట్ ఆదిన తాండవ కృష్ణ, మరియు మేట్లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# ఆ 10 మంది ఎమ్మెల్యేలపై టీడీపీ సైలెంట్ యాక్షన్

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటింది. అధికార తెలుగుదేశం పార్టీ లో అంతర్గత క్రమశిక్షణపై ఆ పార్టీ హైకమాండ్ అత్యంత కఠినమైన వైఖరిని అవలంబిస్తోంది. ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన ఉత్సాహంలో కొందరు ఎమ్మెల్యేలు రూట్ మారుస్తూ, పార్టీ గీసిన లక్ష్మణ రేఖను దాటుతుండటంపై అధినేత నారా చంద్రబాబు నాయుడు సీరియస్ యాక్షన్‌కు దిగినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా వివాదాస్పద వ్యాఖ్యలు, సొంత క్యాడర్‌తో విభేదాలు, పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్న కొందరు శాసనసభ్యులను హెచ్చరించడం మానేసి.. నేరుగా దూరం పెట్టే వ్యూహాన్ని టీడీపీ అమలు చేస్తోంది. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మొదటి నుండి తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ప్రదర్శిస్తూ వచ్చారు. అయితే, ఇటీవల కాలంలో ఆయన పార్టీ హైకమాండ్ నిర్ణయాలను బహిరంగంగానే ధిక్కరిస్తూ, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. పార్టీ అధిష్ఠానం పలుమార్లు అంతర్గతంగా హెచ్చరించినప్పటికీ ఆయన తన వైఖరిని మార్చుకోలేదు. దీంతో టీడీపీ అగ్రనాయకత్వం ఆయనను పూర్తిగా పక్కనబెట్టేసింది. ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణను ఇప్పటికే ఇతర నేతలు చూస్తున్నారు. ఆయనను కేవలం పేరుకే ఎమ్మెల్యే అన్నట్లుగా మార్చేసింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారికైనా ఇదే గతి పడుతుందనేందుకు కొలికపూడి ఎపిసోడ్ ఒక ఉదాహరణగా నిలిచింది. మరోవైపు సత్యవేడు ఎమ్మెల్యే కోనేరు ఆదిమూలం ప్రవర్తన కూడా పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. మహిళతో వివాదాస్పదంగా ప్రవర్తించి వార్తల్లోకి ఎక్కిన ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆ వివాదం సెటిల్ చేసుకున్నా ఆయనను పార్టీలో కలుపుకోలేదు. అందుకే ఆయన కుమారుడు ఇటీవల ప్రెస్మీట్ పెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా

టీడీపీ హైకమాండ్ పట్టించుకోవడం లేదు. సత్యవేడులో క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని నమ్ముకున్న పాత కార్యకర్తలు సైతం ఆయనను ఓన్ చేసుకోవడం లేదు. ఈ విషయాన్ని ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా, సోషల్ మీడియా ఫీడ్‌బ్యాక్ ద్వారా గ్రహించిన చంద్రబాబు.. సత్యవేడులో ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే పనులు జరిగేలా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని రంగంలోకి దించారు. తద్వారా క్యాడర్‌ను కాపాడుకుంటూనే, ఎమ్మెల్యేకు గట్టి షాక్ ఇచ్చారు. వలం ఈ ఇద్దరే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది మందికి పైగా ఎమ్మెల్యేల జాబితాను పార్టీ ఇంటెలిజెన్స్ వింగ్ సిద్ధం చేసింది. అధికారం అండతో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం, ఇసుక, భూ దందాల్లో తలదూర్చడం, కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగించకుండా వివాదాలు కొనితెచ్చుకోవడం వంటి నెగెటివ్ రిపోర్ట్స్ ఉన్న నేతలందరినీ ఈ లిస్టులో చేర్చారు. వీరిలో కొందరు ఉత్తరాంధ్ర, మరికొందరు రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారు కూడా ఉన్నట్లుగా చెబుతున్నారు. గతంలో 2014-19 మధ్య కాలంలో కొందరు ఎమ్మెల్యేల మితిమీరిన ప్రవర్తన వల్లే పార్టీ 23 సీట్లకు పడిపోయిందనే చేదు నిజాన్ని చంద్రబాబు నాయుడు ఎప్పటికీ మర్చిపోలేదు. అందుకే, ఈసారి 135 కి పైగా సీట్ల భారీ మెజారిటీ ఉండటంతో.. ఒకరిద్దరు లేదా పది మంది ఎమ్మెల్యేలు దూరమైనా ప్రభుత్వానికి వచ్చే ముప్పేమీ లేదనే ధీమాతో హైకమాండ్ ఉంది. వ్యవస్థ ముఖ్యం, ప్రజల్లో పార్టీ ఇమేజ్ ముఖ్యం..

అంతేకానీ దారి తప్పిన ఎమ్మెల్యేల కోసం పార్టీ ప్రతిష్టను పణంగా పెట్టలేం అని లోకేష్, చంద్రబాబు ఇద్దరూ అంతర్గత సమావేశాల్లో తెగేసి చెప్పారు. మారమని హెచ్చరించడం కంటే, వారిని పక్కనబెట్టి ప్రత్యామ్నాయ నేతలను తయారు చేయడం ద్వారా సదరు ఎమ్మెల్యేల పొగరు దించే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.టీడీపీ హైకమాండ్ తీసుకుంటున్న ఈ నిశ్శబ్ద అడుగులు.. సదరు వివాదాస్పద ఎమ్మెల్యేలకు భవిష్యత్తుపై పెద్ద హెచ్చరికగా మారాయి. ప్రస్తుతం వీరిని దూరం పెట్టడం అంటే.. వచ్చే ఎన్నికల్లో వీరికి టికెట్లు దక్కే ప్రసక్తే లేదనే సంకేతాన్ని క్యాడర్‌కు బలంగా పంపడమే. సోషల్ మీడియాలో కూడా ఈ ఐసోలేషన్ స్ట్రాటజీపై సామాన్య కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు తప్పు చేస్తే వెనకేసుకొచ్చే పాత రోజులు పోయాయని, పద్ధతి మార్చుకోకపోతే ఎంతటి సీనియర్ అయినా మాజీ అవ్వక తప్పదని టీడీపీ పంపుతున్న ఈ స్ట్రాంగ్ మెసేజ్.. మిగిలిన ఎమ్మెల్యేలను కూడా దారిలోకి తెస్తుందని భావిస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నవంబర్ లో సీఐఐ సదస్సు

**విశాఖపట్టణం, జూలై 2 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త పంథాను ఎంచుకుంది. వచ్చే నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నం వేదికగా ప్రతిష్ఠాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సన్నాహక సమీక్షా సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ఈ సదస్సును గతానికి భిన్నంగా, వినూత్నంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈసారి భాగస్వామ్య సదస్సు కేవలం విశాఖపట్నానికే పరిమితం కాకుండా.. రాష్ట్రంలోని ఐదు ప్రధాన నగరాలైన విశాఖ, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలలో ప్రాంతీయ భాగస్వామ్య సదస్సులు నిర్వహించాలని సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఎంఓయూలు , పెట్టుబడుల సంతకాలే ధ్యేయం కాకుండా.. అంతర్జాతీయ స్థాయి జ్ఞానాన్ని పంచుకోవడం మీద ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఈ సదస్సుల ద్వారా యువతలో సరికొత్త ఆలోచనలను రేకెత్తించాలని, టెక్నాలజీ రంగంలో గ్లోబల్ ఛాంపియన్లుగా ఎదిగేలా గైడెన్స్ ఇవ్వాలని సూచించారు. విదేశీ ప్రతినిధులతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఈ సదస్సుకు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ప్రాంతీయ స్థాయిలో నిర్వహించే ఈ సదస్సులలో స్టార్టప్ కంపెనీలకు, సరికొత్త ఆవిష్కరణలకు అగ్రతాంబూలం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆలోచనలకు ఈ వేదికలు ఊతమివ్వాలని.. నేటి తరం యువత భాగస్వామ్యాన్ని ఇందులో భారీగా పెంచాలని సూచించారు. ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశ, విదేశాల్లో భారీగా రోడ్ షోలు నిర్వహించనున్నారు. దేశీయంగా ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి నగరాల్లో రోడ్ షోలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాల పరిశ్రమలకు అనుకూలమైన అవకాశాలు ఉన్నాయో ముందే బేరీజు వేసుకుని.. ఆయా ప్రాంతీయ సదస్సులలోనే నిర్దిష్టమైన ఎంఓయూలు కుదుర్చుకునేలా ఏర్పాట్లు చేయాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. అలాగే, అమరావతిలో 'సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ఈ సందర్భంగా వెల్లడించారు. పారిశ్రామిక ప్రగతితో పాటు పబ్లిక్ పాలసీలు, భవిష్యత్ ఫ్యూచరిస్టిక్ రంగాలపై ఈ సదస్సులో కీలక చర్చలు జరగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. కేవలం పరిశ్రమలే కాకుండా వ్యవసాయం, ఉద్యానవన రంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ మరియు నేటి కార్పొరేట్ ప్రపంచానికి అవసరమైన 'స్ట్రెస్ ఫ్రీ వర్క్' వంటి వినూత్న అంశాలపై గ్లోబల్ నిపుణులు, ప్రముఖ యూనివర్సిటీల ప్రొఫెసర్లు చర్చించేలా ప్లాన్ చేయాలన్నారు.

## శంకుస్థాపనలతో సరా 19 ఏళ్లలో మూడోసారి

**కడప, జూలై 2 పెన్ పవర్:** వైఎస్సార్ కడప జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. జూలై 3న ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతోంది. అయితే, 2007 నుంచి ఇప్పటివరకు వరుసగా వచ్చిన ముఖ్యమంత్రులంతా శంకుస్థాపనల మీద శంకుస్థాపనలు చేస్తూనే ఉన్నా.. క్షేత్రస్థాయిలో ఒక్క ఇటుక కూడా పడకపోవడంపై రాయలసీమ వాసుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారి వేయబోయే పునాది రాయి అయినా ప్రాజెక్టు పూర్తికి దారితీస్తుందా.. లేక గత చరిత్ర పునరావృతమవుతుందా? అన్న సంశయాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. కానీ, విభజన జరిగి పన్నెండేళ్లు గడుస్తున్నా.. ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలతో పాటు కడప స్టీల్ ప్లాంట్‌పై కేంద్రం ఇచ్చిన మాటను పూర్తిగా విస్మరించిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టడంలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు విఫలమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం చేతులెత్తేయడంతో, రాష్ట్ర ప్రభుత్వమే ఈ భారీ ప్రాజెక్టును మోయాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర ఖజానాపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతోంది.కడప స్టీల్ ప్లాంట్ చరిత్రను గమనిస్తే.. ఇదొక శంకుస్థాపనల రికార్డుగా నిలిచిపోతుంది. 2007లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో జమ్మలమడుగు వద్ద మొదటిసారి శంకుస్థాపన చేశారు. అది ముందుకు సాగలేదు. విభజన తర్వాత 2018లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సున్నిపెంట వద్ద శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారిన వెంటనే 2019 డిసెంబర్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కడప స్టీల్ ప్లాంట్‌కు మూడోసారి పునాది రాయి వేశారు.ఆయా కంపెనీల బోర్డులు మారడం, శంకుస్థాపనల శిలాఫలకాలు పడటమే తప్ప ప్రాజెక్టు మాత్రం అంగుళం కూడా ముందుకు కదల్లేదు. కడప స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వాల చిత్తశుద్ధిపై ప్రతిపక్షాలు మరియు ప్రజాసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. రాష్ట్రంలోకి వచ్చే ప్రైవేట్ స్టీల్ ప్రాజెక్టులకు మరియు ఇతర పారిశ్రామిక దిగ్గజాలకు వేల కోట్ల రూపాయల విలువైన భూములు, విద్యుత్, నీటి రాయితీలను గుమ్మరిస్తున్న పాలకులు.. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగాల్సిన కడప స్టీల్ ప్లాంట్‌కు మాత్రం నిధులు కేటాయించడంలో వెనుకాడుతున్నారనే చర్చ నడుస్తోంది. ఇప్పుడు జూలై 3న జరగబోయే శంకుస్థాపన అయినా రాయలసీమ నిరుద్యోగుల ఆశలను నిజం చేస్తుందో, లేక కేవలం ఎన్నికల, రాజకీయ ప్రచార అస్త్రంగానే మిగిలిపోతుందో కాలమే సమాధానం చెప్పాలి.

## వైసీపీ బలమైన స్థానాలే టార్గెట్...

**విశాఖపట్టణం, జూలై 2 పెన్ పవర్:** అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ పోటీ రోజురోజుకు మరింత ఆసక్తికరంగా మారుతోంది. ముఖ్యంగా వచ్చే ఆంధ్రప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి పార్టీ తమ బలహీన, బలమైన ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది. ఈ క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గంగా భావించే అరకు ఇప్పుడు జనసేన పార్టీ వ్యూహాల్లో కీలక స్థానం సంపాదించిందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.అరకు ప్రాంతంలో గత కొన్నేళ్లుగా వైసీపీకి బలమైన మద్దతు ఉంది. గిరిజన ఓటర్లలో ఆ పార్టీకి మంచి పట్టుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇప్పుడు అదే ప్రాంతంలో తన బలాన్ని పెంచుకోవాలని జనసేన భావిస్తున్నట్లు సమాచారం. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడం, స్థానిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ఆ పార్టీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అరకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం పొందుతోంది. కూటమి రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నియోజకవర్గంలో బలమైన నిర్మాణం అవసరమని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అందుకే స్థానిక కార్యకర్తలను మరింత చురుకుగా పనిచేయాలని సూచనలు ఇస్తున్నారని చెబుతున్నారుఅరకు పార్లమెంట్ పరిధిలో గిరిజన సమస్యలు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలు ఎప్పుడూ ప్రధాన చర్చగా ఉంటాయి. ఈ సమస్యల పరిష్కారంపై ప్రజల్లో విశ్వాసం కల్పించగలిగితే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని జనసేన అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం ద్వారా తమ ప్రభావాన్ని పెంచుకోవాలని పార్టీ ప్రయత్నాలు చేస్తోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక వైసీపీ కూడా తన బలమైన ఓటు బ్యాంకును నిలబెట్టుకోవడానికి కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో లభించిన మద్దతును కొనసాగించేందుకు స్థానిక నాయకులు ప్రజలతో మరింత మమేకం అవుతున్నారని సమాచారం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా తమ ఆధిక్యాన్ని కొనసాగించాలని ఆ పార్టీ ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.రానున్న ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అరకు రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన పార్టీలతో పాటు కూటమి వ్యూహాలు కూడా ఈ ప్రాంత ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తే అరకు నియోజకవర్గంలో పోటీ గతంతో పోలిస్తే మరింత ఉత్కంఠభరితంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.అయితే అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమీకరణాలు, ఎన్నికల నాటికి మారే రాజకీయ పరిస్థితులు కూడా ఫలితాలపై ప్రభావం చూపే అంశాలుగా ఉంటాయి. అందుకే ఇప్పటి నుంచే అన్ని పార్టీలు తమ తమ వ్యూహాలను అమలు చేస్తూ ప్రజల్లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అరకు వంటి కీలక ప్రాంతాల్లో రాజకీయ పోటీ మరింత ఆసక్తికరంగా మారుతుండటంతో రానున్న రోజుల్లో అక్కడి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కూడా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వారికి వన్ టైం సెటిల్మెంట్...టీడీపీలో చర్చ ?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ ఎంతో మందికి అవకాశాలు ఇచ్చిన పార్టీ. ఆ పార్టీ నుంచి గెలిచిన వారు లోక్ సభ స్పీకర్ స్థాయి దాకా వెళ్లారు, అలాగే ముఖ్యమంత్రులు కూడా అయ్యారు. గవర్నర్లు కేంద్ర మంత్రులు అయ్యారు. దేశంలో వేరే ఏ ప్రాంతీయ పార్టీకి లేనంత పొలిటికల్ హిస్టరీ ఈ విషయంలో టీడీపీకి ఉంది. అయితే పార్టీ ఇచ్చిన అవకాశాలు చాలా మంది సద్వినియోగం చేసుకుంటే కొందరు మాత్రం తమకు తోచిన ధోరణిలో పోతున్నారు. ఇక 2024 లో టీడీపీ టికెట్లలో అధిక శాతం యువతకు కొత్తవారికి ఇచ్చింది. సర్పంచుల నుంచి నేరుగా ఎమ్మెల్యేలు అయిన వారు ఉన్నారు. అలాగే పార్టీ పదవులు చేపడుతూ ఎమ్మెల్యేలు ఎంపీలుగా అయిన వారు ఉన్నారు. వీరిలో విషయం తెలిసిన వారు మళ్లీ మళ్లీ గెలవాలని అనుకునే వారు తపన పడుతున్నారు. జనంతో పార్టీ జనంతో మమేకం అవుతున్నారు. అయితే వచ్చిన పదవిని అధికారాన్ని చూసి ఉబ్బి తబ్బిబ్బు అవుతున్న వారు మాత్రం తమదైన శైలిలో పని చేస్తున్నారు. వీరి విషయంలో అధినాయకత్వం ఎన్ని సార్లు క్లాస్ తీసుకున్నా వ్యవహారం మాత్రం చక్కబడడం లేదని అంటున్నారు.

**పనితీరు మదింపు :**

ఇదిలా ఉంటే రెండేళ్ల కూటమి పాలన పూర్తి అయింది. 2024 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన 135 మంది ఎమ్మెల్యేల పనితీరుని అయితే అధినాయకత్వం చాలా జాగ్రత్తగా మదింపు చేస్తోంది అని అంటున్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఎంత ప్రజా సమస్యల మీద ఎమ్మెల్యేల స్పందన ఎలా ఉంది. ప్రజలతో వారికి ఉన్న కనెక్షన్, పార్టీ క్యాడర్ తో మసలుతున్న వైనం ఇవన్నీ కూడా హైకమాండ్ చాలా నిశితంగా పరిశీలన చేస్తోంది అని అంటున్నారు. ఈ విషయంలో అయితే టెలి కాన్ఫరెన్సులు పెట్టి సమావేశాలు వర్చువల్ గానూ నేరుగానూ పెట్టి చేసిన దిశా నిర్దేశాల మేరకు ఎంత మంది పనిచేస్తున్నారు ఎంత మంది దారిలోకి వచ్చారు, మరెంత మంది ఇంకా మార్పు తెచ్చుకోలేక అలాగే ఉన్నారు అన్నది కూడా పార్టీ చాలా క్లోజ్ గా మోనిటరింగ్ చేస్తోంది అని అంటున్నారు.

**వారితోనే ఇబ్బంది :**

ఇక చాలా మంది ఎమ్మెల్యేలు ఇంకా దారిలోకి రాలేదని అంటున్నారు. పలు రకాలైన నివేదికలు పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన సమాచారం, నిఘా వర్గాల నుంచి వచ్చిన భోగట్టాలు అన్నీ కూలంకషంగా తరచి చూసిన మీదట పార్టీ ఇప్పటిదాకా చేసిన హెచ్చరికలు చాలు అనుకుంటోంది అని అంటున్నారు. ఎంతగా అప్రమత్తం చేసినా కూడా పట్టించుకోని వారి విషయంలో ఇక కఠినంగా ఉండాల్సిందే అన్నది హైకమాండ్ సీరియస్ గా ఆలోచిస్తోంది అని అంటున్నారు. ఇక వారిని అలా చూసీ చూడనట్లుగా వదిలేయాలని కొత్త నాయకత్వం ఆయా సీట్లలో ప్రోత్సహించాలని కూడా నిర్ణయించుకున్నట్లుగా చెబుతున్నారు.

**ప్రభుత్వ కార్యక్రమాల్లో :**

ఇక సామాజిక పెన్షన్లు ఏపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఇస్తోంది. నెలకు నాలుగు వేల రూపాయలు అంటే మామూలు విషయం కాదు, అలాగే దివ్యాంగుల పెన్షన్ ఇతర కేటగిరీలలో చూస్తే పదిహేను వేల దాకా పెన్షన్ ఇస్తున్నారు. మరి వీటిని జనాలకు అందచేసే కార్యక్రమంలో చాలా మంది ఎమ్మెల్యేలు అయితే జనంలోకి రాకపోవడం పట్ల అయితే హైకామండ్ ఆగ్రహంగా ఉంది అని అంటున్నారు. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలలో ఉదాశీనత కొందరిలో ఎక్కువగా కనిపిస్తోంది అని అంటున్నారు. అలాగే ప్రభుత్వం చేసే అభివృద్ధి గురించి జనంలో ప్రచారం చేయకుండా సొంత పనుల్లో బిజీగా ఉండేవారి లెక్కను వన్ టైం తోనే సెటిల్ చేయాలని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఆల్టర్నేషన్ లీడర్ షిప్ ని అక్కడ డెవలప్ చేసి ఈ తరహా నిర్లక్ష్యం చేస్తున్న వారికి చెక్ పెట్టాలని నిర్ణయించుకున్నారు అని అంటున్నారు. ఉత్తరాంధ్రా గోదావరి కోస్తా రాయలసీమల్లో సమానంగానే ఈ వన్ టైం ఎమ్మెల్యేలు ఉన్నట్లుగా చెబుతున్నారు.

# జడ శ్రావణ్ తో జాగ్రత్త పడుతున్న జగన్!



**విజయవాడ, జూలై 2 పెన్ పవర్:**

ఏపీ రాజకీయాల్లో కుల ప్రభావం అధికంగా ఉంటుంది. కులాల వారీగా ఓట్లు చీలిపోతాయి కూడా. అలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రెడ్డి సామాజిక వర్గం అండ ఉంటుంది. మరోవైపు దళిత క్రైస్తవ ఓటర్లు కూడా అటువైపే మొగ్గు చూపుతారు. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయం చవిచూసింది. కానీ దళిత క్రైస్తవులు మాత్రం ఆ పార్టీని ఆదరించారు. అయితే ఆ ఓటు బ్యాంకు పై తాజాగా గురి పెట్టారు జడ శ్రవణ్ కుమార్. గోదావరి జిల్లాలో దళిత క్రైస్తవ సభ పెట్టి.. మీరంతా జడ శ్రావణ్ తాలూకా అని చెప్పే రోజు వస్తుందని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ మాదిరిగా ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం అవుతానని కూడా తేల్చి చెప్పారు. పనిలో పనిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై కూడా సున్నిత విమర్శలు చేశారు. దీంతో ఆ పార్టీలో అంతర్మధనం ప్రారంభం అయ్యింది.కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు జడ శ్రావణ్ కుమార్ సేవలను వాడుకోవాలని చూసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. సాక్షి మీడియాలో ఆయన ప్రెస్మీట్లకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతూ వస్తోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు తో పాటు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా జడ శ్రావణ్ కుమార్ వ్యాఖ్యలు నడిచేవి. ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ శ్రావణ్ కుమార్ ను ఒక అస్త్రంగా మార్చుకోవాలని చూసింది. కానీ ఇప్పుడు అదే జడ శ్రవణ్ నేరుగా జగన్మోహన్ రెడ్డికి అత్యంత కీలకమైన దళిత క్రైస్తవ ఓటు బ్యాంకుకే ఎసరు పెట్టేలా ఉన్నారు. ఏలూరులో దళిత క్రైస్తవ సమర శంఖారావం బహిరంగ సభ నిర్వహించారు. అయితే ఇది కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సభ. కానీ వైసీపీని ఉలిక్కిపడేలా చేసేసారు శ్రావణ్ కుమార్.ఆకివీడు ఘటన నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు క్రైస్తవ మతాన్ని కించపరిచారని ప్రధాన అజెండాతో ఈ సభ నడిచింది. రఘురామకృష్ణం రాజును తీవ్రస్థాయిలో టార్గెట్ చేసిన జడ శ్రావణ్ కుమార్ ఈ సభ ద్వారా దళిత క్రైస్తవులను ఒక తాటిపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. తనను తాను అభినవ అంబేద్కర్ గా చూపించే ప్రయత్నం చేశారు. కేవలం వేదికలపై ఉపన్యాసాలకే పరిమితం కాకుండా.. ఇకపై రాష్ట్రంలోని దళిత క్రైస్తవులంతా పాము జడ శ్రావణ్ తాలూకా అని గర్వంగా చెప్పుకోవాలి అంటూ ఇచ్చిన పిలుపు వైసిపిలో సంచలనంగా మారుతుంది. ఆ పార్టీ నేతలు ఇప్పుడు శ్రావణ్ కుమార్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ ఓటు బ్యాంకు పైనే గురి పెడతారా అని ప్రశ్నిస్తున్నారు. తాము మీడియా మైలేజ్ ఇస్తూ.. పరోక్షంగా పాలు పోసి పెంచిన జడ శ్రావణ్.. ఇప్పుడు సొంత సామాజిక వర్గాలను చీల్చే ప్రయత్నం చేస్తుండడం పై వైసీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు.జడ శ్రావణ్ కుమార్ నేరుగా ఈసారి తాను ఉప ముఖ్యమంత్రిని అవుతానని చెబుతున్నారు. అయితే అది ఎలా సాధ్యమో తెలియడం లేదు. కానీ అనవసరంగా జడ శ్రవణ్ కుమార్ ను హైలెట్ చేశామని వైసిపి నేతలు బాధపడుతున్నారు. ఇప్పుడు ఈ అంశంతో కూటమికి ప్రయోజనం చేకూర్చేలా ఉంది పరిస్థితి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకులో చీలిక వస్తే ఆ పార్టీకి దారుణ పరాజయం తప్పదు.. జడ శ్రావణ్ నిజంగా దళిత క్రైస్తవ ఓట్లను టార్గెట్ చేసుకుంటే ప్రతి నియోజకవర్గంలో వేలాది ఓట్లకు గండి పడవచ్చు వైసీపీకి. కూటమిని దెబ్బతీయడానికి వాడిన అస్త్రం ఇప్పుడు రివర్స్ తిరిగి జగన్ సొంత సామ్రాజ్యాన్ని దెబ్బతీసేలా ఉంది.

## వైభవ్ సూర్యవంశీని ఆడించాల్సింది.. ప్యాంట్లు ఊడగొట్టేవాడు: రవిశాస్త్రి



భారత జట్టు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఐర్లాండ్ పర్యటనలో తుది జట్టులోకి తీసుకోకపోవడంపై టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇండియన్ టీమ్ లోకి తొలిసారి పిలుపు అందుకున్న 15 ఏళ్ల వైభవ్, వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ బెంచ్‌కే పరిమితం కావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మలు అద్భుత ఫామ్‌లో ఉండటంతో ఈ నిర్ణయం సమర్థనీయమే అయినప్పటికీ, ఐర్లాండ్ సిరీస్‌లో భారత బ్యాటింగ్ ఘోరంగా విఫలమై 2--0తో సిరీస్ ఓడిపోయింది.

**అతడ్ని బెంచ్‌పై కూర్చోబెడతారా?:**

గత 12 నెలలుగా వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని రవిశాస్త్రి గుర్తు చేశారు. ముఖ్యంగా ఐపీఎల్‌లో ప్రపంచ స్థాయి బౌలర్లను సైతం చితక్కొడుతూ ఏకంగా 776 రన్స్ సాధించి ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడని పేర్కొన్నారు. అంతటి ఫామ్‌లో ఉన్న ప్లేయర్‌ను ఐర్లాండ్ టూరులో ఆడించి ఉంటే, అక్కడి చిన్న మైదానాల్లో ప్రత్యర్థి బౌలింగ్‌ను ముక్కలు ముక్కలు చేసేవాడని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు.

**రవిశాస్త్రి తనదైన శైలిలో కామెంట్స్:**

ఐర్లాండ్ సిరీస్‌లోనే వైభవ్ సూర్యవంశీ కచ్చితంగా ఆడాల్సింది.. అక్కడ పిచ్‌లు చాలా స్లోగా, స్పాంజీగా ఉన్నాయి, పైగా గ్రౌండ్ కూడా చాలా చిన్నది.. అతను గనుక బరిలోకి దిగి ఉంటే బంతిని స్టేడియం బయటకి బాదేవాడు.. ప్రత్యర్థి బౌలర్ల ప్యాంట్లు ఊడదీసేలా ఆడి ఉండేవాడని పేర్కొన్నాడు. ఇప్పుడు ఇంగ్లాండ్ సిరీస్‌లో అతనికి అవకాశం ఇస్తారో లేదో నాకు తెలియదు.. కానీ అతనికి వీలైనంత త్వరగా జట్టులో ఛాన్స్ ఇవ్వాలి.. ఐపీఎల్‌లో అతను ఏ ఫాస్ట్ బౌలర్‌ను వదిలిపెట్టలేదు.. అలాంటి ఆటగాడిని తెచ్చి మీరు బెంచ్ పై కూర్చోబెడతారా? అని మండిపడ్డాడు.

**అతనే టీమిండియా ఎక్స్-ఫ్యాక్టర్:**

వైభవ్ సూర్యవంశీ భారత జట్టుకు ఒక ఎక్స్-ఫ్యాక్టర్.. అతని కోసం జట్టులో ఎలాగైనా స్థానం కల్పించాలని రవిశాస్త్రి మేనేజ్‌మెంట్‌కు సూచించారు. కేవలం 15 ఏళ్ల వయసున్న వైభవ్‌కు ఎలాంటి ముందస్తు అంచనాల ఒత్తిడి, యువ రక్తం కావడంతో అతను మైదానంలో నిర్భయంగా ఆడతాడని కొనియాడారు. అతను గనుక క్రీజులో నిలదొక్కుకుని మొదటి 2, 3 ఓవర్లు ఆడితే, మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు భారీ స్కోర్లు చేయడానికి అవసరమైన బలమైన పునాదిని ఓపెనింగ్‌లోనే అందిస్తాడని రవిశాస్త్రి గట్టిగా చెప్పారు.

## కరీంనగర్ డైమండ్స్ అదిరిపోయే కమ్‌బ్యాక్.. రంగారెడ్డిపై 58 రన్స్ తేడాతో విజయం

టీజీ20 లీగ్ 2026 ప్రారంభంలో వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిపోయిన కరీంనగర్ డైమండ్స్ జట్టు ఇప్పుడు టోర్నమెంట్‌లో దూసుకుపోతుంది. ఈరోజు (జులై 2న, గురువారం రంగారెడ్డి రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 58 పరుగుల భారీ తేడాతో విక్టరీ సాధించింది. ఈ లీగ్‌లో వరుసగా మూడో విజయాన్ని ఖాతాలో వేసుకున్న కరీంనగర్ డైమండ్స్, పాయింట్ల పట్టికలో ఏకంగా రెండో స్థానానికి దూసుకెళ్లి రచ్చ లేపింది.





**కరీంనగర్ బ్యాటర్ల ఊచకోత:**

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ డైమండ్స్ బ్యాటర్లు రంగారెడ్డి బౌలర్లపై చెలరేగిపోయారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి ఏకంగా 230 పరుగులని స్కోరుబోర్డుపై పెట్టారు. ఇక కరీంనగర్ బ్యాటర్లలో రాహుల్ రాడేశ్ (37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 72 రన్స్ ), ఎఖ సింహ (38 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 పరుగులు) హాఫ్ సెంచరీలతో కిరాక్ ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరి జోడీ మూడో వికెట్‌కు ఏకంగా 123 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టు భారీ స్కోరు చేయడంలో కీ రోల్ పోషించింది. ఓపెనర్లు సాత్విక్ రెడ్డి (13 బంతుల్లో 24), తన్మన్ అగర్వాల్ (16 బంతుల్లో 29) పర్వాలేదనిపించగా, చందన్ సహాని 19, శుభమ్ శర్మ 17లి రన్స్ చేశారు. కాగా రంగారెడ్డి బౌలర్లలో తనయ్ జడ్డూ 2 వికెట్లు తీసుకోగా.. నితిన్ సాయి యాదవ్, తనయ్ త్యాగరాజన్ చెరో వికెట్ పడగొట్టారు.

**చేతులెత్తేసిన రంగారెడ్డి రైజర్స్ బ్యాటర్లు:**

231 రన్స్ లక్ష్యంతో బరిలోకి దిగిన రంగారెడ్డి రైజర్స్ జట్టు కరీంనగర్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక నిర్ణీత 20 ఓవర్లలో 172/9 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. రంగారెడ్డి బ్యాటర్లలో ఆదిత్య జవ్వాజి (31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 48 పరుగులు) టాప్ స్కోరర్‌గా నిలిచినప్పటికీ జట్టును మాత్రం గెలిపించలేకపోయాడు. జ్ఞాన ప్రకాష్ రెడ్డి (23), ఆరోన్ జార్జ్ (19), నితిన్ సాయి యాదవ్ (15) తక్కువ రన్స్ కే ఔట్ కాగా.. చివర్లో ఆర్యన్ కరియప్ప (20 బంతుల్లో 30లి) కాస్త దూకుడుగా ఆడినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీంతో 58 పరుగుల తేడాతో కరీంనగర్ డైమాండ్స్ చేతిలో రంగారెడ్డి ఓడిపోయింది.

## శ్రీలంకతో భారత్ టెస్ట్ సిరీస్.. తేదీలు, టైమింగ్స్ ప్రకటించిన బీసీసీఐ!



భారత క్రికెట్ జట్టు ఆగస్టు మాసంలో శ్రీలంకలో పర్యటించనుందని లంక క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. 2025--2027 ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా ఈ రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జరగనుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 10:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో మొదటి టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 15 నుంచి 19 వరకు గాలే ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఆ తర్వాత రెండో టెస్ట్ మ్యాచ్ ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ (ఎస్ఎస్‌సి) గ్రౌండ్‌లో నిర్వహిస్తారు.

**డబ్ల్యూటీసీ ఫైనల్ రేస్.. శ్రీలంకకు ప్రతి మ్యాచ్ అత్యంత కీలకం:**

గతంలో రెండుసార్లు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరినా టైటిల్ గెలవలేకపోయిన భారత జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతుండగా.. శ్రీలంక ఆరో స్థానంలో ఉంది. వచ్చే ఏడాది జరగబోయే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరడానికి శ్రీలంకకు కేవలం 5 నుంచి10 శాతం అవకాశాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. దాంతో హోమ్ గ్రౌండ్‌లో జరగబోయే ఈ సిరీస్‌లో లంక జట్టు ఏ చిన్న తప్పు చేసినా ఫైనల్ రేస్ నుంచి పూర్తిగా తప్పుకోవాల్సి వస్తుంది.

**గిల్ సేనకు కమ్‌బ్యాక్ ఛాన్స్.. స్పిన్ పిచ్‌లపై అసలైన పరీక్ష:**

శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో ఇంగ్లాండ్‌తో 2- 2 తేడాతో సిరీస్ డ్రా చేసుకోవడం, వెస్టిండీస్‌పై హోమ్ సిరీస్ గెలవడంతో గిల్ ఎరా బాగానే ప్రారంభమైంది. కానీ, గత ఏడాది సౌతాఫ్రికా చేతిలో స్వదేశంలో క్లీన్ స్వీప్ ఓటమి భారత జట్టు అవకాశాలని దెబ్బతీసింది. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్ల వైఫల్యం, అలాగే మన స్పిన్ విభాగంలో పస తగ్గడం లాంటి లోపాలు ఆ సిరీస్‌లో స్పష్టంగా బయటపడ్డాయి. ఐపీఎల్ లో ఉండే ఫ్లాట్ పిచ్‌లు, టెస్ట్ మ్యాచ్‌లకు ముందు తగినంత ప్రాక్టీస్ సమయం లేకపోవడమే ఇండియన్ బ్యాటర్లు స్పిన్‌కు ఇబ్బంది పడటానికి ప్రధాన కారణాలుగా మారుతుండగా, ఇప్పుడు శ్రీలంక పిచ్‌లపై లంక స్పిన్నర్లను తట్టుకుని నిలబడటం గిల్ సేనకు అతిపెద్ద సవాల్ కానుంది.

## సింప్లిసిటీనే బ్యూటీ... అమైరా దస్తూర్ ఎలిగెంట్ లుక్ వైరల్!

ఫిలిం ఇండస్ట్రీలో మూడు భాషల్లో సినిమాలు చేస్తూ, తన టాలెంట్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాల తార అమైరా దస్తూర్. నటనతోనే కాకుండా తన అదిరిపోయే ఫ్యాషన్ సెన్స్‌తో కూడా ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా ఆమె సాంప్రదాయ లుక్‌లో చేసిన ఒక సాఫ్ట్ అండ్ క్లాసిక్ ఫోటోషూట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. మోడరన్ డ్రెస్సుల్లోనే కాకుండా ట్రెడిషనల్ చీరకట్టులోనూ ఆమె అందం నెక్స్ట్ లెవెల్‌లో ఉందంటూ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు.

**లావెండర్ ఆర్గాంజా శారీలో మెరిసిన భామ:**

ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో అమైరా దస్తూర్ 'హౌస్ ఆఫ్ సుహి' ఫ్యాషన్ బ్రాండ్‌కు చెందిన లైట్ లావెండర్ కలర్ ఆర్గాంజా శారీ కట్టుకుంది. ఇక ఎంతో సున్నితంగా, సింపుల్ మిర్రర్ వర్క్ డిజైన్‌తో ఉన్న ఈ పారదర్శక చీరలో ఆమె చాలా ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. భారీ డిజైన్లు లేకుండా ఎంతో సింపుల్‌గా ఉన్నా.. ఆమె రాయల్ లుక్ మాత్రం అందరినీ కట్టిపడేస్తోంది.

**పర్ఫెక్ట్ మ్యాచ్.. స్లీవ్‌లెస్ బ్లౌజ్ మరియు గాజులు:**

ఈ లైట్ కలర్ చీరకు కాంట్రాస్ట్‌గా ఉండేలా ఐమైరా డీప్ పర్పుల్ కలర్ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను మ్యాచ్ చేసింది. ఈ కలర్ కాంబినేషన్ ఆమె లుక్‌ను మరింతగా ఎలివేట్ చేసింది. ఇక దీనికి తోడు చేతులకు వేసుకున్న మ్యాచింగ్ పర్పుల్ కలర్ గాజులు ఆ లుక్‌కు పర్ఫెక్ట్ ట్రెడిషనల్ టచ్ ఇచ్చాయి. ఆభరణాల విషయంలో కూడా ఎక్కువ హడావుడి లేకుండా కేవలం ఆక్సిడైజ్డ్ జుంకాలు మాత్రమే పెట్టుకుంది.

**అన్ని భాషల్లోనూ అదరగొడుతున్న అమైరా:**

అమైరా దస్తూర్ కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన క్యారెక్టర్స్ చేస్తూ దూసుకుపోతోంది. క్రైమ్ డ్రామా సిరీస్ 'బంబాయి మేరి జాన్', తమిళ థ్రిల్లర్ 'బఘీరా' లలో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతేకాదు, పంజాబీ రొమాంటిక్ డ్రామా 'పుర్తీలా' తో రీజనల్ మార్కెట్‌లోనూ హిట్ కొట్టింది. నటిగానే కాకుండా తన సొంత ఫ్యాషన్ వెంచర్స్‌తో బిజినెస్ ఉమన్‌గానూ రాణిస్తోంది.

**నెట్‌ఫ్లిక్స్ 'చుంబక్' పై భారీ ఆశలు:**

ప్రస్తుతం అమైరా దస్తూర్ నెట్‌ఫ్లిక్స్ లో రాబోతున్న మోస్ట్ అవేటెడ్ మల్టీస్టారర్ కామెడీ డ్రామా 'చుంబక్' సినిమాలో నటిస్తోంది. ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్ తో ఓటీటీలో మరో పెద్ద సక్సెస్ అందుకోవాలని చూస్తోంది. ఒకవైపు సినిమాలు చేస్తూనే, మరోవైపు ఇలాంటి లవ్లీ ఫోటోషూట్స్‌తో సోషల్ మీడియాలో తన ఫాలోయింగ్‌ను భారీగా పెంచుకుంటోంది.

అటు మోడరన్ లుక్స్, ఇటు ట్రెడిషనల్ స్టైల్.. ఏదైనా సరే అమైరా దస్తూర్ చాలా ఈజీగా క్యారీ చేయగలదని ఈ ఫోటోలతో మరోసారి ప్రూవ్ అయ్యింది. ఇక సింప్లిసిటీనే అసలైన బ్యూటీ అని నిరూపిస్తున్న ఈ లావెండర్ శారీ లుక్ ఇప్పుడున్న యంగ్ గర్ల్స్‌కు ఒక పర్ఫెక్ట్ ఫ్యాషన్ ఇన్స్పిరేషన్ అని చెప్పొచ్చు.







Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965